

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపర్ పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

కర్నూలు, డోన్, ఆత్మకూరు, కల్లూరు	- 99854 09260
కర్నూలు, కోడుమూరు, నందికొట్కూరు	- 9985411379
ఆదోని, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు	- 9985171793
నంద్యాల, పాణ్యం, ఆళ్ళగడ్డ, బనగానపల్లె	- 9985411377



ఆకట్టుకుంటున్న భారీ గణేశుడు

పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను చాటేలా కొలువుదీరిన ఎకో ఫ్రెండ్లీ గణనాథుడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. కర్నూలుకు చెందిన యువత ఏకంగా 63 అడుగుల ఎత్తులో ఎకో ఫ్రెండ్లీ గణపతి మూర్తిని రూపొందించింది. గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో ఈ భారీ మట్టి వినాయకుడు పూజలు అందుకుంటున్నారు. నగరంలోని పెద్ద మార్కెట్ సమీపంలో తుంగభద్ర నది ఒడ్డున ఈ ఉత్సవ గణపతిని నెలకొల్పారు. బంకమట్టి, వెదురు బద్దలు, జనపనార, కొబ్బరి పీచు, గడ్డి, నీటిలో సులువుగా కరిగిపోయే సంప్రదాయ రంగులతో ఈ విగ్రహాన్ని రూపొందించారు. ఇతర గణపతి మూర్తుల్లా కాకుండా, గణేశ్ నవరాత్రి ఉత్సవాల అనంతరం ఈ మట్టి విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించకుండా ఉన్న చోటే నిమజ్జనం చేస్తున్నారు. ఫైర్ ఇంజన్ల ద్వారా నీటిని విగ్రహంపై పిచికారీ చేస్తూ కరిగిన మట్టిని తుంగభద్ర నదిలో కలిసిపోయేలా ఏర్పాట్లు చేశారు. -కర్నూలు కల్చరల్

వైద్యం పేరిట దోపిడీ



- ఆర్ఎంపీలు, ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు కుమ్మక్కు
- చిన్న అనారోగ్య సమస్యకూ రకరకాల పరీక్షలు
- ప్రజల జేబుకు చిల్లు

నంద్యాల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి):

ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లా వ్యాప్తంగా సీజన్ వ్యాధులు ప్రబలాయి. దీంతో రోగులు వైద్యుల వద్దకు పరిగెత్తుతున్నారు. చాలా మంది ఖర్చుకు భయపడి, పట్టణానికి వెళ్లాలంటే దూరాభారం అనే ఉద్దేశంతో పెద్దాసుపత్రులు, ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లకుండా గ్రామాల్లో ఉండే ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా తీసుకుంటున్న ఆర్ఎంపీలు రోగుల నుంచి డబ్బులు దండుకుంటున్నారు. పట్టణాల్లో ఉండే ప్రైవేటు, కార్పోరేటు ఆస్పత్రులతో కుమ్మక్కవుతూ తమ వద్దకు వచ్చే రోగులను ఫలానా ఆస్పత్రికి వెళ్లడంటూ పంపుతున్నారు. ఆర్ఎంపీలు పంపిన రోగి వద్ద నుంచి సదరు ఆస్పత్రులు పరీక్షలు, స్కానింగ్‌లు అంటూ వేలకు వేల రూపాయలు గుంజుతున్నాయి. అయినా అధికారులు పట్టించుకోవటం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

30 నుంచి 40 శాతం కమీషన్

'వైద్యో నారాయణో హరిః' ఇది ఒకప్పటి మాట. వైద్యం సేవగా భావించే రోజులు పోయాయి. ప్రస్తుతం వైద్యం వ్యాపారంగా మారిపోయింది. బిల్డింగ్ అద్దె కట్టగలిగి, వైద్యులను నెల జీతం ఇవ్వగలిగే ఎవరైనా ఆస్పత్రిని ప్రారంభించే పరిస్థితి ఉంది. ఇలా మొదలైన ఆస్పత్రులు తమ తరఫున ఓ నలుగురు పీఆర్‌వోలను నియమించుకుని ఊరూరా తిప్పుతాయి. వీరు గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ఆర్ఎంపీలను కలిసి చికిత్స కోసం వచ్చే రోగులను తమ ఆస్పత్రులకు పంపేలా ఒప్పందం కుదుర్చుకుంటారు. ఆర్ఎంపీలు పంపే రోగుల నుంచి ఆస్పత్రి యాజమాన్యాలు చికిత్స, మందులు, బెడ్ చార్జీలంటూ వసూలు చేసే మొత్తంలో 30 నుంచి 40 శాతం ఆర్ఎంపీలకు ముట్టజెప్పుతున్నట్లు సమాచారం. ఈ రిఫరల్‌కు అలవాటు పడ్డ ఆర్ఎంపీలు అవసరం ఉన్నా లేకపోయినా తమ వద్దకు వచ్చే రోగులను పట్టణాల్లోని ఆస్పత్రులకు పంపుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వైద్యం చేయించుకుని అప్పుల పాలైన ఉదంతాలు కోకొల్లలు. వెరసి ప్రస్తుతం ఆస్పత్రుల యాజమాన్యాలు పవిత్రమైన వైద్య వృత్తిని ఓ దందాగా మార్చేశాయి.

అర్హతకు మించి వైద్యం

జిల్లాలో కొందరి ఆర్ఎంపీల విద్యార్హతను పరిశీలిస్తే వారిలో చాలామందికి సరైన అక్షర జ్ఞానం కూడా ఉండదు. ఇక వైద్య పరిభాష సంగతి సరేసరి. అయినా వీరంతా వైద్యులుగా చలామణి అవుతున్నారు. ఒకపుడు ఆర్ఎంపీలు తాము వైద్యం అందించే చోట 'ప్రథమ చికిత్సా కేంద్రం' అని బోర్డు పెట్టుకునేవారు. ప్రస్తుతం క్లినిక్‌లు, ఆస్పత్రి అంటూ బోర్డులు తగిలించుకుంటున్నారు. ప్రథమ చికిత్సకు మాత్రమే పరిమితమవ్వాల్సిన ఆర్ఎంపీలు నిపుణులైన వైద్యుల మాదిరి చికిత్సను అందించటమే కాకుండా బీపీ, షుగరు వంటి దీర్ఘకాలిక రోగాలకు కూడా మందులు అందిస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. దీనికి తోడు ఫార్మా కంపెనీల ఇచ్చే బహుమతులకు అలవాటు పడిన ఆర్ఎంపీలు తమ వద్దకు వచ్చిన రోగులకు విచ్చలవిడిగా యాంటిబయోటిక్స్ రాయటం, పట్టా ఉన్న వైద్యుల పర్యవేక్షణలోనే అందించాల్సిన స్టెరాయిడ్స్‌ను సైతం అందిస్తూ అందిస్తూ రోగుల ప్రాణాల మీదకు తీసుకువస్తున్నారు. ఆర్ఎంపీలు ఇలా వ్యవహరించటంపై కొంతమంది వైద్యులు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా యాంటిబయోటిక్స్, స్టెరాయిడ్స్ అమ్మకాలు విపరీతంగా పెరిగిపోవడం కూడా దీనికి నిదర్శనమనే విమర్శలు ఉన్నాయి. ఆర్ఎంపీల తతంగమంతా సంబంధిత అధికారులకు తెలియదనడానికి ఆస్కారం లేదు. ఏ గ్రామానికి వెళ్లినా ఆర్ఎంపీల వైద్యశాలలు బహిరంగంగానే కనిపించటమే కాకుండా, వారు అందించే వైద్యం అందించే తీరు కూడా తెలిసిపోతుంది. ఆర్ఎంపీల వ్యవహారంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆర్ఎంపీలు చెప్పినట్లు వినాల్సిందే

ఆర్ఎంపీల వెనుక పెద్ద మెడికల్ మాఫియానే నడుస్తోంది. ఆస్పత్రుల మధ్య పోటీ పెరగడంతో ఆస్పత్రుల యాజమాన్యాలు ఆర్ఎంపీల మీద ఆధారపడుతున్నాయి. వారికి ఇచ్చే రిఫరల్ డబ్బులను సర్దుబాటు చేయాలంటే రోగుల నుంచి ఎక్కువ పిండుకోవాలన్న ధ్యాసలో ఆస్పత్రులు ఉంటున్నాయి. అవసరం లేకపోయినా రోగులకు పరీక్షలు, చికిత్సలు చేస్తున్నాయి. కొన్ని ఆస్పత్రుల్లో అయితే ఏకంగా అనవసరపు ఆపరేషన్లు కూడా చేశాయన్న ఆరోపణలు గతంలో వచ్చాయి. గ్రామాల నుంచి రెఫరల్స్‌ను పంపటం పూర్తిగా ఆర్ఎంపీల మీద ఆధారపడి ఉంటుందన్నది వాస్తవం. ఇక ఇదే అదనుగా ఆర్ఎంపీలు ఆస్పత్రి యాజమాన్యాలపైన ఓ రకంగా పెత్తనం కూడా చేస్తున్నారన్న విమర్శలున్నాయి. తమను సరిగా పట్టించుకోకుండా, తమకు కావాల్సినవి అందించకపోయినా.. ఆ కోపాన్ని రోగులపైన చూపుతున్నట్లు విమర్శలు కూడా ఉన్నాయి. అత్యవసర పరిస్థితి ఉన్న రోగిని వైద్యం అందించే ఆస్పత్రికి తరలించేందుకు నిరాకరిస్తున్నారు. ఇక తమను పట్టించుకోని ఆస్పత్రికి వెళ్లిన రోగులు ఏదైనా సందర్భంలో వైద్యం కోసం తమ దగ్గరకు వస్తే సదరు ఆర్ఎంపీలు పట్టించుకోవటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలా అటు రోగులు, ఇటు ఆస్పత్రి యాజమాన్యాలు తమ మీదే ఆధారపడేలా ఆర్ఎంపీలు ఓ రకమైన అనివార్యతను సృష్టించి సొమ్ము చేసుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.





ఒక్క రోజుకే రూ.10 వేలు వసూలు

నంద్యాలకు సమీపంలోని ఓ గ్రామంలోని వ్యక్తి తన కూతురికి దగ్గు, జలుబు ఉందని ఆర్ఎంపీని కలిశాడు. సదరు ఆర్ఎంపీ పట్టణంలోని నంద్యాలలోని ఓ ఆస్పత్రి పేరు సూచించాడు. ఊళ్లో ఎప్పటి నుంచో తెలిసిన వ్యక్తి, పైగా ఆర్ఎంపీ అన్న ఉద్దేశంతో రోగి ఆర్ఎంపీ సూచించిన ఆస్పత్రికి వెళ్లాడు. తీరా ఆస్పత్రి యాజమాన్యం రాసిన పరీక్షలు, వేసిన బిల్లులు, ఇచ్చిన మందులు చూసి చికిత్స కోసం వచ్చిన రోగికి కళ్లు తిరిగినంత పనైంది. ఏకంగా అడ్మిట్ చేసుకొని ఒకరోజుకు రూ.10 వేలు బిల్లు వేశారు. అయితే స్పెషల్ బెడ్ కావాలంటే ఇక్కడ లేదని, వేరే ఆసుపత్రిలో తమ వైద్యులు వచ్చి సేవలు అందిస్తారని చెప్పారు. దీనికి అదనంగా రూ.5 వేలు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. దీంతో అదే ఆసుపత్రిలోనే అడ్మిట్ చేశారు. అంటే దోపిడీ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. చదువుకున్న వారికి కూడా వైద్య పరిభాష ఏమిటో తెలియకపోవడంతో వైద్యులు చెప్పిన వాటికి తల ఊపడం మినహా చేసేదేమీ ఉండదు. దీంతో వైద్యులు ఆస్పత్రులకు వచ్చే రోగులను పీల్చి పిప్పి చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం: ఎస్పీ



అర్జీని పరిశీలిస్తున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

నంద్యాల క్రైం, సెప్టెంబరు 13: నిత్యం ప్రజాసేవలో నిమగ్నమై ఉండే పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యమిస్తామని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా అన్నారు. నంద్యాల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని సిబ్బంది నుంచి అర్జీలు స్వీకరించారు. సిబ్బంది వృత్తిపరమైన, ఆరోగ్యపరమైన, వ్యక్తిగతమైన పలు సమస్యలపై అర్జీలు స్వీకరించారు. సిబ్బంది సమస్యలను తెలుసుకున్న ఎస్పీ సత్వరం పరిష్కరించే వాటిపై వెంటనే దృష్టి సారిస్తామని చెప్పారు. మిగతా వాటిని ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పోలీస్ సిబ్బంది కూడా గ్రీవెన్స్ డేను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ విజయభాస్కర్, సీసీ నాగరాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

లండన్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో

శ్రీశైల దేవస్థానానికి చోటు



ధ్రువీకరణ పత్రాన్ని అందుకుంటున్న ఎమ్మెల్యే, ఈవో

శ్రీశైలం, సెప్టెంబరు 13: శ్రీశైలం దేవస్థానానికి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు జాబితాలో స్థానం లభించింది. శ్రీశైల క్షేత్ర ఆధ్యాత్మిక ప్రాముఖ్యత, ప్రధాన ఆలయ విస్తీర్ణం, ప్రధాన ఆలయం చుట్టూ ఉన్న అరుదైన శిల్ప ప్రాకారం, ప్రాచీన కట్టడాలు మొదలైన అంశాలను పరిగణనలోకి తీసుకొని స్థానం కల్పించినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. శుక్రవారం దేవస్థానం పరిపాలన కార్యాలయ భవనంలోని సమావేశ మందిరంలో ఆ సంస్థ దక్షిణ భారత విభాగపు సంయుక్త కార్యదర్శి ఉల్లాజి ఇలియాజర్ సంబంధిత ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీశైల క్షేత్ర ఆధ్యాత్మిక ప్రాముఖ్యత వల్ల లండన్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం లభించిడం ఎంతో సంతోషాన్ని కలిగించిందని అన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు మాట్లాడుతూ భూ మండలానికి నాభిస్థానం శ్రీశైల క్షేత్రం, పుణ్య తీర్థాలు, మొదలైన ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీక అని అన్నారు. కార్యక్రమంలో దేవస్థానం పలువురు యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛతా హి సేవా'ను విజయవంతం చేయాలి: కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తున్న కలెక్టర్ రాజకుమారి


నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 13: ఈ నెల 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు జరిగే స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ రాజకుమారి క్షేత్ర స్థాయి అధికారులను ఆదేశించారు. నంద్యాల కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం, పీజీఆర్ఎస్, డివార్మింగ్ డే తదితర అంశాలు, అజెండా అంశాలపై ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సంబంధిత శాఖల క్షేత్రస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్ని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల ఉద్యోగులను భాగస్వామ్యం చేయాలన్నారు. పారిశుధ్య కార్మికులతో దేవాలయాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, పర్యాటక ప్రదేశాలు, పాఠశాలలు, ప్రభుత్వ భవనాలలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అన్ని పీహెచ్‌సీలలో పారిశుధ్య కార్మికులతోపాటు వారి కుటుంబ సభ్యులకు కూడా 74 రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వాలని, ఆరోగ్య బీమా కూడా వర్తింపజేయాలని ఆదేశించారు. ఓహెచ్ఆర్ఎస్ ట్యాంకులను శుభ్రపరిచి క్లోరినేషన్ అయిన నీటిని సరఫరా చేయాలన్నారు. పీజీఆర్ఎస్‌లో స్వీకరించిన అర్జీలకు నాణ్యమైన రీతిలో ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని ఆదేశించారు. 1 నుంచి 18 సంవత్సరాలలోపు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు మిగించాలని సూచించారు. జిల్లాలో లక్ష కుటుంబాలకు వంద రోజుల పని దినాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గృహ నిర్మాణాల పురోగతికి సంబంధించి హౌసింగ్ మ్యాన్డేట్స్ కల్పిస్తే వేతన రేట్ పెరిగి జిల్లాకు అదనపు మెటీరియల్ కాంపోనెంట్ వస్తుందన్నారు. అంగన్‌వాడీలు, ఆరోగ్యకర్తల సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్లే 4 మాతృమరణాలు సంభవించాయన్నారు. పెండింగ్‌లో ఉన్న 60వేల ఎకరాల పంట, రెండు లక్షల రైతుల ఈకేవైసీ పూర్తి చేసేందుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు.

శ్రీశైల జలాశయానికి

తగ్గిన ఇన్‌ఫ్లో

శ్రీశైలం, సెప్టెంబరు 13: శ్రీశైలం జలాశయానికి శుక్రవారం వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో జలాశయం క్రస్టుగేట్లను మూసివేశారు. జలాశయం ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి వరద ప్రవాహం స్వల్పంగా కొనసాగుతోంది. జూరాల నుంచి 56,056 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 20,196 క్యూసెక్కులు మొత్తం 76,152 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. శుక్రవారం రాత్రి 9 గంటల సమాయానికి జలాశయానికి 82,139 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 884.10 అడుగులుగా నమోదయింది. జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 210.5133 టీఎంసీలుగా నమోదయింది. ఆంధ్రప్రదేశ్ జల విద్యుత్ కేంద్రం ద్వారా 30,824 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 37,116 క్యూసెక్కుల నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు.

శ్రీశైలం డ్యాం



ఎక్సైజ్ శాఖలో 14 స్టేషన్లు విలీనం

సెబ్‌ను రద్దు చేస్తూ ప్రభుత్వం జీవో జారీ



ఎక్సైజ్ సూపరింటెండెంట్

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 13: ఎక్సైజ్ శాఖకు పూర్వ ప్రాభవం రాబోతోంది. ఎక్సైజ్ శాఖలోకి 14 సెబ్ స్టేషన్లను విలీనం చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసిందని ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎం.సుధీర్ బాబు తెలిపారు. కర్నూలు జిల్లాలో కర్నూలు, కోడుమూరు, ఆదోని, ఆలూరు, ఎమ్మిగనూరు, కోసిగి, పత్తికొండ స్టేషన్లు ఉన్నాయి. నంద్యాల జిల్లాలో నంద్యాల, నందికొట్కూరు, ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల, బనగానపల్లె, డోన్, ఆత్మకూరు సెబ్ స్టేషన్లను ఎక్సైజ్ శాఖలో విలీనం చేసింది. రెండు రోజుల క్రితమే సెబ్ విభాగాన్ని ఎక్సైజ్ శాఖలో విలీనం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెలలో జరిగే కేబినెట్ సమావేశం తర్వాత నూతన ఎక్సైజ్ పాలసీ విధివిధానాలను రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించనుంది. ఈలోపు సెబ్ రద్దు.. ఎక్సైజ్ శాఖ పునరుద్ధరణ తదితర అంశాలపై అబ్కారీ శాఖ ఇప్పటికే కసరత్తు మొదలుపెట్టింది.

మరింత పెరిగిన ఉల్లి ధర

కర్నూలు(అగ్రికల్చర్), సెప్టెంబరు 13: కర్నూలు మార్కెట్ యార్డులో శుక్రవారం ఉల్లి ధర మరింత పెరిగింది. దాదాపు రూ.7,691 క్వింటాళ్ల ఉల్లిని రైతులు మార్కెట్‌కు తీసుకువచ్చారు. గరిష్ఠ ధర రూ.3,801, మధ్యస్థ ధర రూ.1,422, కనిష్ఠ ధర రూ.309గా నమోదైంది. అదేవిధంగా వేరుశనగ కాయలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు కంటే ఎక్కువ ధర లభించింది. గరిష్ఠ ధర రూ.7,670 మధ్యస్థం రూ.4,532, కనిష్ఠం రూ.1,512 రైతులకు దక్కిందని కర్నూలు మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ గోవిందు తెలిపారు. కందులు గరిష్ఠంగా రూ.10,211, మధ్యస్థం, కనిష్ఠం ధరలు రూ.9,696గా అమ్ముడయ్యాయి.

బీఎస్ఎన్ఎల్ అభివృద్ధికి కృషి

కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు



కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 13: భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ సంస్థ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కర్నూలు పార్లమెంటు సభ్యుడు బస్తిపాటి నాగరాజు పిలుపునిచ్చారు. ప్రకాశ్‌నగర్‌లోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో శుక్రవారం అధికారులు, ఉద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా కర్నూలు బిజినెస్ ఏరియా జనరల్ మేనేజర్ జి.రమేష్ ఉమ్మడి జిల్లాలో సంస్థ అందిస్తున్న సేవలు, 4జీ టవర్లు, ఫైబర్ నెట్ వర్క్ గురించి ఎంపీకి వివరించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ మారుమూల గ్రామాలకు సేవలు అందించాలనే లక్ష్యంతో జిల్లాలో 340 టవర్లు ఏర్పాటు చేయడానికి ముందుకు పోతోందన్నారు. ఫైబర్ నెట్ సేవలు అందించేందుకు ప్రయత్నాలు కూడా చేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో ఏజీఎం అడ్మిన్ యు.శ్రీనునాయక్, డీజీఎం రాజాశ్వరరావు, డీఈలు నారాయణస్వామి, మురళీక్రిష్ణ, జాన్సన్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

22న టైపిస్టు అసోసియేషన్ ఎన్నికలు

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 13: ఏపీ రాష్ట్ర టైపిస్టు అండ్ స్టెనోగ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా యూనిట్ ఎన్నికలు ఈ నెల 22న నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి బి.సురేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సి.క్యాంపు సెంటర్‌లోని టైపిస్టు అండ్ స్టెనోగ్రాఫర్స్ అసోసియేసన్ భవనంలో జరిగే ఎన్నికలకు ఉప ఎన్నికల అధికారిగా గుంటూరు జిల్లా అధ్యక్షుడు బి.విజయ్ కుమార్, పరిశీలకుడిగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రవేఖర్ వ్యవహ రిస్తారని చెప్పారు. రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌గోపాల కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీసీ శంకర్ నాయక్ హాజరవుతారని చెప్పారు. ఈ నెల 18లోపల ఉమ్మడి జిల్లాలోని ప్రతి టైపిస్టు, స్టెనోగ్రాఫర్ సభ్యత్వం తీసుకోవాలని సూచించారు.

ప్రశాంతంగా ఎల్ఎల్‌బీ పరీక్షలు

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 13: ఎల్ఎల్‌బీ నాలుగో సంవత్సరం 7వ సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని పరీక్షల విభాగం కంట్రోలర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని ఉస్మానియా కళాశాలలో 46 మందికిగాను 40 మంది పరీక్షకు హాజరయ్యారని చెప్పారు.

బయోమెట్రిక్ హాజరుపై ఎన్ఎంసీ సీరియస్

- వైద్యుల ఆలస్యంపై చర్యలు తీసుకోవాలని ఆదేశం

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 13: కర్నూలు మెడికల్ కాలేజీలో వైద్యుల బయోమెట్రిక్ లేట్ హాజరుపై నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) సీరియస్ అయింది. జూలై, ఆగస్టు నెలల్లో బయోమెట్రిక్ హాజరును వైద్యులు ఆలస్యంగా వేస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఎన్ఎంసీ నిబంధనల మేరకు వైద్యులు మెడికల్ కాలేజీకి వచ్చినప్పుడు ఉదయం 9 గంటలలోపు అలాగే ఇంటికి వెళ్లేటప్పుడు హాజరును సాయంత్రం 4 గంటలకు నమోదు చేయాలి. అయితే కర్నూలు మెడికల్ కాలేజీలో ఈ నిబంధనలకు వ్యతిరేకంగా ఉదయం 9 గంటల నుంచి 9.10 గంటలకు ఎక్కువ సంఖ్యలో హాజరు వేస్తుండటంపై ఎన్ఎంసీ ఆగ్రహం వ్యక్తం చేసింది. కాలేజీలో 360 మంది ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ట్యూటర్లు, సీనియర్ రెసిడెంట్లు, పీజీలు ఉన్నారు. ఉదయం 9 నుంచి 9.10 గంటల వరకు గ్రేస్ పీరియడ్‌లో అత్యధిక సంఖ్యలో హాజరు వేస్తున్నారు. ఇలా కుదరదని, ఉదయం 9 గంటలలోపు హాజరు వేయాలని, ఉదయం 9 గంటల తర్వాత బయోమెట్రిక్ వేస్తే లేటు హాజరు కిందకు వస్తుందని ఎన్ఎంసీ కరాఖండిగా చెప్పింది. ఎన్ఎంసీ ఆదేశాల మేరకు శుక్రవారం కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.చిట్టి నరసమ్మ చర్యలు ప్రారంభించారు. ఆలస్యంగా హాజరు వేసిన 30 మంది వైద్యులు, సీనియర్ రెసిడెంట్లుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

కుందూనదిలో ముమ్మర గాలింపు

ఒక మృతదేహం లభ్యం

కోవెలకుంట్ల, సెప్టెంబరు 13: మండలంలోని కలుగొట్లకు చెందిన బాలగురప్ప, రామసుబ్బారెడ్డి గురువారం కుందూలో గల్లంతైన విషయం విదితమే. ఎస్డీఆర్ఎఫ్ పోలీసు బలగాలతో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టి శవాల ఆచూకీ తెలపాలని వారికి ఆదేశించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం కర్నూలుకు చెందిన ఎస్డీఆర్ఎఫ్ పోలీసు బృందంలోని 18 మంది కలుగొట్లలోని కుందూ వద్దకు చేరుకని గల్లంతైన వ్యక్తుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. బాలగురప్ప మృతదేహం లభ్యమైంది. రామసుబ్బారెడ్డి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. బాలగురప్ప మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోవెలకుంట్ల వైద్యశాలకు తరలించారు.

గణనాథుల వీడ్కోలుకు సన్నాహాలు

- 1,689 మంది పోలీసులతో బందోబస్తు
- సీసీ కెమెరాలతో నిఘా
- రూ.41.25 లక్షల నిధులతో ఏర్పాట్లు
- సిద్ధంగా ఎనిమిది క్రేన్లు.. గజ ఈతగాళ్లు
- కర్నూలు నగరంలో ట్రాఫిక్ మళ్లింపు

కర్నూలు, సెప్టెంబరు 13: గణనాథుల వీడ్కోలుకు సన్నాహాలు జరుగుతున్నాయి. నగరంలో గణేశ్ నవరాత్రుల ఉత్సవాలు వైభవంగా జరిగాయి. 9వ రోజు ఆదివారం నిమజ్జనానికి అంతా సిద్ధమయ్యారు. విజయవాడ వరదల నేపథ్యంలో సుమారు 400 మంది పోలీసులు అక్కడ బందోబస్తుకు వెళ్లారు. సిబ్బంది కొరత నేపథ్యంలో పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. బందోబస్తుకు క్లిష్టమవుతున్న నేపథ్యంలో మూడు, ఐదు రోజులకే గ్రామాల్లో, మండలాల్లో నిమజ్జనాలు చేయించారు. కర్నూలు నగరంలో మాత్రమే 9వ రోజు నిమజ్జనానికి సన్నాహాలు చేస్తున్నారు. కర్నూలు నగరంలో సుమారు రెండు వేల విగ్రహాలు ఉన్నట్లు పోలీసు రికార్డులు చెబుతున్నాయి. ఈసారి క్యూఆర్ కోడ్‌తో జియోట్యాగింగ్ చేసి సాంకేతికతను ఉపయోగించారు. ఆన్‌లైన్‌లో సమగ్ర సమాచారం పోలీసుల వద్దనే ఉంది. ఆన్‌లైన్‌లో వెళ్లి లోకేషన్ ఆప్షన్ బటన్ ప్రెస్ చేస్తే సంబంధిత విగ్రహాల వివరాలు తెలుస్తాయి.



మాట్లాడుతున్న ఎస్పీ

పోలీసు బందోబస్తు: ఆదివారం గణేశ్ నిమజ్జనోత్సవం సందర్భంగా జిల్లా పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన భారీ పోలీసు బందోబస్తు చర్యలు చేపట్టింది. ఎస్పీ జి.బిందుమాధవ్ ఆధ్వర్యంలో శాంతియుతంగా సంప్రదాయ రీతిలో నిమజ్జన ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకునే విధంగా చర్యలు చేపట్టారు. నిమజ్జనంలో బందోబస్తు విధుల్లో అడిషినల్ ఎస్పీ ఒకరు, 11 మంది డీఎస్పీలు, 58 మంది సీఐలు, ఆర్ఐలు, 133 మంది ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, 346 మంది ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 642 మంది పోలీసు కానిస్టేబుల్స్, 34 మంది హోంగార్డులు, 6 సెక్షన్ల ఏఆర్ సిబ్బంది, 15 స్పెషల్ పార్టీ బృందాలను నియమించారు. కర్నూలు జిల్లాతోపాటు అన్నమయ్య, కడప, నంద్యాల జిల్లాల నుంచి బందోబస్తును నియమించారు. మొత్తం 1689 మంది పోలీసులతో భారీ సంఖ్యలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు. నిమజ్జనం రోజున బాంబు డిస్పోజబుల్, డాగ్ స్క్వాడ్ బృందాలతో విస్తృత తనిఖీలు చేపట్టేలా ఆదేశాలు వచ్చాయి. నిమజ్జనం కార్యక్రమంతా డ్రోన్, సీసీ కెమెరాలు, వీడియో కెమెరాలతో చిత్రీకరిస్తున్నారు. అసాంఘిక శక్తులు, అల్లరిమూకలపై గట్టి నిఘా ఉంచారు.

పోలీసుల సూచనలు: రాంబోట్ల దేవాలయం నుంచి మొదటి విగ్రహం బయలుదేరుతుంది. నగరంలోని విగ్రహాలు వీలైనంత త్వరగా నిమజ్జనానికి సిద్ధం కావాలి.
- విగ్రహాలను పోలీసులు బయలుదేరే సమయంలో కరెంటు తీగల వద్ద వినాయక విగ్రహాల నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలి.
- విగ్రహాలను తరలించడానికి ముందు రోజే వాహనాలను క్రేన్‌లను సిద్ధంగా ఉంచుకోవాలి.
- చిన్న పిల్లలు నిమజ్జన ఊరేగింపు వాహనాలకు దూరంగా ఉంచాలి.
- నిమజ్జన ఘాట్ల దగ్గరకు నిమజ్జనానికి వీక్షించేందుకు వచ్చే మహిళలు, వృద్ధులు, పిల్లలు జాగ్రత్తలు పాటించాలి.
- విగ్రహ నిమజ్జన ఊరేగింపు సమయంలో ఇతరుల మనోభావాలను కించపరిచేలా విధగా వ్యవహరించకూడదు.
- ఆసుపత్రుల దగ్గర హోరెత్తించే డీజేలతో రోగులకు ఇబ్బందులు కలిగించరాదు.. భారీ లౌడ్ స్పీకర్లు, డీజేలతో అధిక శబ్దాలు చేస్తే చర్యలు ఉంటాయి.
- ఆకతాయిలు మద్యం సేవించి అత్యుత్సాహం ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటారు.
- మతపెద్దలు, రాజకీయ పార్టీలు, శాంతి కమిటి సభ్యులు, యువత శాంతియుత వాతావరణానికి సహకరించాలి.
- మున్సిపాలిటీ ఆధ్వర్యంలో రూ.41.25 లక్షలు వెచ్చించి అట్టహాసంగా నిమజ్జన ఏర్పాట్లు చేస్తున్నారు. నగరమంతా మైకులు, విద్యుద్దీపాలతో అలంకరించారు. 25 ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఒక కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. గజ ఈతగాళ్ల కోసం నిధులు వెచ్చిస్తున్నారు. 6 ఘాట్లలో 8 క్రేన్లను సిద్ధం చేశారు. అదనంగా రెండు క్రేన్లను సిద్ధంగా ఉంచారు. పలు చోట్ల తాగునీటి సరఫరా కోసం నిధులు వెచ్చిస్తున్నారు. 250 మంది పారిశుధ్య కార్మికులను నియమించారు. వినాయక ఘాట్‌ను అదనంగా పెయింటింగ్‌తో సుందరీకరించారు.

నగరంలో ట్రాఫిక్ మళ్లింపు

నిమజ్జనం సందర్భంగా ఆదివారం నగరంలో ట్రాఫిక్ మళ్లింపు ఉంటుంది. 15న ఉదయం 10 గంటలను గణేశ్ నిమజ్జనం కార్యక్రమం పూర్తయ్యే వరకు నగరంలో ట్రాఫిక్‌ను మళ్లించినట్లు ఎస్పీ తెలిపారు. అత్యవసర 108, ఫైర్, అంబులెన్సులు, పోలీసు వాహనాలు సేవల కోసం పోలీసులతో అనుమతి పొందిన వాహనాలు మాత్రమే నిమజ్జన మార్గంలో అనుమతిస్తారన్నారు.
- ఆర్టీసీ బస్టాండు నుంచి రాజ్‌విహార్ సెంటర్, ప్రభుత్వ ఆసుపత్రి, వినాయక ఘాట్, గాయత్రీ ఎస్టేట్ వరకు ఎటువంటి వాహనాలకు అనుమతి ఉండదు.
- ఆర్టీసీ బస్టాండు నుంచి ఆర్టీసీ బస్సులు ఇతర వాహనాలను బళ్లారి చౌరస్తా మీదుగా కల్లూరు చెన్నమ్మ సర్కిల్, గుత్తి పెట్రల్ బంకు, బిర్లా కాంపౌండ్, మద్దూరు నగర్ సర్కిల్, సీ క్యాంపు మీదగా నంద్యాల చెక్‌పోస్టు వైపు వాహనాల రాకపోకలు ఉంటాయి.
- ఆత్మకూరు, నంద్యాల, నందికొట్కూరు, నంద్యాల చెక్‌పోస్టు వైపు నుంచి నగరంలోకి వచ్చే వాహనాలు సీ క్యాంపు, బిర్లా గేటు, గుత్తి పెట్రోల్ బంకు మీదుగా కల్లూరు చెన్నమ్మ సర్కిల్, బళ్లారి చౌరస్తా మీదుగా కర్నూలు ఆర్టీసీ బస్టాండుకు చేరుకుంటాయి.
- హైదరాబాదు, గద్వాల అలంపూరు నుంచి వచ్చే వాహనాలు తుంగభద్ర బ్రిడ్జి, సంతోష్‌నగర్, బళ్లారి చౌరస్తా మీదుగా ఆర్టీసీ బస్టాండుకు చేరుకుంటాయి.

నిమజ్జనం పూర్తయిన తర్వాత వాహనాలు దేవనగర్ మీదుగా కృష్ణానగర్, కల్లూరు బ్రిడ్జి మీదుగా బయటకు వెళ్తాయి.

నిమజ్జనం ప్రశాంతంగా జరగాలి


నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలి. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి చర్యలు చేపట్టాం. ఎక్కడ అనుమానితులు కనిపించినా సమీపంలోని పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ఉత్సవ కమిటీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించాం. మసీదులు, చర్చిల వద్ద డీజేలకు అనుమతులు లేవు. ఎప్పటికప్పుడు విగ్రహాలు నిమజ్జనానికి చేరుకునేలా చర్యలు తీసుకోవాలని సీఐలకు ఆదేశాలు ఇచ్చాం. మద్యం సేవించి ఆకతాయిలు అల్లర్లు చేస్తే కఠిన చర్యలు ఉంటాయి.

- ఎస్పీ బిందు మాధవ్

పెద్దాసుపత్రిలో ఫిర్యాదుల బాక్సులు

రోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 13: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సూపరింటెండెంట్ వినూత్న పరిపాలనకు శ్రీకారం చుట్టారు. వంద రోజుల పరిపాలన సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర్ రెడ్డి ఐదు చోట్ల ఫిర్యాదుల బాక్సులను ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఆసుపత్రిలో కొత్తగా ఏఎంసీ, క్యాజువాల్టీ వార్డులను ఏర్పాటు చేసి అత్యవసర రోగుల బెడ్ల కొరతను తీర్చిన ఆయన ఆ తర్వాత వార్డుల్లో ఫ్యాన్లు, లైట్లు, దాతల సహాయంతో వేయించడం, డ్రైనేజీ వ్యవస్థను మార్చడంతోపాటు ఎస్ఆర్‌ఐల సహకారంతో పరికరాలను సమకూర్చారు. ప్రస్తుతం రోగుల సమస్యలను పరిష్కరించేందుకు న్యూడయోగ్నస్టిక్ బ్లాక్, క్యాజువాల్టీ గైనిక్, పీడీయాట్రిక్, సుశ్రుత భవన్ ప్రాంతాల్లో ఐదు చోట్ల ఫిర్యాదుల బాక్సులను ఏర్పాటు చేయించారు. ఆసుపత్రిలో ఎవరైనా డబ్బులు అడిగినా.. నిర్లక్ష్యంగా వ్యవహరించినా డ్యూటీలో ఉన్న వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల రద్దీ విపరీతంగా పెరగడంతో సాయంత్రం ఓపీ 3 నుంచి 4 గంటల వరకు జరిగే ఓపీలను ఆ యూనిట్ ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు అందరూ తప్పనిసరిగా విధుల్లో ఉండాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర్ రెడ్డి శుక్రవారం సాయంత్రం ఆదేశాలు జారీ చేశారు. ఓపీ ఉన్న వైద్యులకు ఆ రోజు అకాడమిక్ తరగతులకు మినహాయింపు ఇవ్వనున్నారు. సాయంత్రం ఓపీల పర్యవేక్షణ బాధ్యతలను సివిల్ సర్జన్ అడ్మినిస్ట్రేటర్ డా.బీవీ రావుకు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయి ఓపీ రోగుల వివరాలను తెలియజేయాలని ఆదేశించారు.



ఫిర్యాదుల బాక్సులతో సూపరింటెండెంట్

బస్సు కింద పడి వ్యక్తి మృతి

కోవెలకుంట్ల, సెప్టెంబరు 13: ఆర్టీసీ బస్సు కింద పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన శుక్రవారం కోవెలకుంట్ల పట్టణంలోని బనగానపల్లె సర్కిల్‌లో జరిగింది. అమడాల గ్రామానికి చెందిన గురప్ప(45) కూలి పని నిమిత్తం రోజూ కోవెలకుంట్లకు వచ్చేవారు. శుక్రవారం కోవెలకుంట్లలోని పాండురంగస్వామి దేవాలయం పక్కనే ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ ముందు కాలువ పని చేసి ముగించుకుని తిరిగి అమడాలకు బయలుదేరాడు. బనగానపల్లె సర్కిల్ వద్దకు వచ్చేసరికి ప్రొద్దుటూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బనగానపల్లె నుంచి కోవెలకుంట్లకు వస్తూ మలుపు వద్ద ఢీకొట్టింది. గురప్ప బస్సు కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కోవెలకుంట్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు.


అమానవీయం



- కొడుకు ప్రేమ పెళ్లి చేసుకున్నాడని తల్లికి శిక్ష
- స్తంభానికి కట్టేసి కొట్టిన యువతి తల్లిదండ్రులు
- తనకేమీ తెలియదని విలపించినా వదిలిపెట్టని దైన్యం
- విడిపించే ప్రయత్నం కూడా చేయని గ్రామస్థులు
- పోలీసుల చొరవతో ఆసుపత్రిలో చేరిన బాధితురాలు

కొడుకు ప్రేమ పెళ్లి చేసుకున్నాడని తల్లిని దారుణంగా కొట్టారు. స్తంభానికి కట్టేసి.. వందలాది మంది చూస్తుండగానే విచక్షణా రహితగా దాడి చేశారు. చీర, రవికను చించేశారు. తనకేమీ తెలియదని ఆ తల్లి వేడుకున్నా ఆ కర్కశకులు వినిపించుకోలేదు. బోరున విలపిస్తున్నా గ్రామస్థుల్లో ఒక్కరంటే ఒక్కరు కూడా ముందుకు వచ్చి విడిపించలేదు. చివరకు ఇంట్లో బంధించబడిన బాధితురాలి చిన్న కొడుకు తన తల్లి ఆర్తనాలు విని పోలీసులకు ఫోన్ చేశాడు. దీంతో వారు గ్రామానికి చేరుకొని ఆమెను ఆసుపత్రికి తరలించారు. ఈ అమానవీయ ఘటన పెద్దకడుబూరు మండలం కల్లుకుంట గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది.

పెద్దకడుబూరు, సెప్టెంబరు 13: పెద్దకడుబూరు మండలం కల్లుకుంట గ్రామంలో గురువారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్థుల సమాచారం మేరకు.. కల్లుకుంట గ్రామంలోని దళిత సామాజిక వర్గానికి చెందిన నరసప్ప, గోవిందమ్మ దంపతు లకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. నరసప్ప ఐదేళ్ల క్రితం మృతి చెంద గా గోవిందమ్మ పిల్లలతో కలిసి గ్రామంలో వ్యవసాయంతోపాటు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఆమె పెద్దకుమారుడు ఈరన్న అదే గ్రామంలోని బీసీ సామాజిక వర్గానికి చెందిన ఓ యువతిని ప్రేమించాడు. వీరి పెళ్లికి ఇరు కుటుంబాల పెద్దలు అంగీకరించకపోవడంతో ఈ ఏడాది ఫిబ్రవరిలో రహస్యంగా పెళ్లి చేసుకున్నారు. అనంతరం తమకు రక్షణ కల్పించాలని ఎస్పీని ఆశ్రయించారు. ఎస్పీ వారిని ఎమ్మిగనూరు డీఎస్పీ దగ్గరకు పంపారు. దీంతో ఎమ్మిగనూరు డీఎస్పీ ఇరువురి కుటుంబ సభ్యులను పిలిపించి నచ్చజెప్పి పంపారు. అలాగే కొన్ని రోజులు ఇంటికి దూరంగా ఉండాలని ప్రేమ జంటకు సూచించారు. దీంతో వారు బెంగళూరుకు వెళ్లిపోయారు. ఈరన్న తల్లి గోవిందమ్మ, తమ్ముడు రాజు మాత్రం ఎమ్మిగనూరులో నివాసం ఉంటున్నారు. అయితే గురువారం చిన్న కుమారుడితో కలిసి పని నిమిత్తం గోవిందమ్మ గ్రామానికి వెళ్లింది. ఈ విషయం తెలుసుకున్న యువతి కుటుంబ సభ్యులు గురువారం రాత్రి ఆమె ఇంటి దగ్గరకు వెళ్లి గొడవకు దిగారు. రాజును ఇంటిలోకి నెట్టివేసి గోవిందమ్మను బీసీ కాలనీలోకి తీసుకెళ్లారు. అక్కడ ఉన్న విద్యుత్ స్తంభానికి కట్టేసి విచక్షణారహితంగా కొట్టారు. చీర, రవికను చింపివేశారు. తనకేమీ తెలియదని, వదిలిపెట్టాలని విలపించినా వదిలిపెట్టలేదు. వందలాది గ్రామస్థులు చూస్తూనే ఉన్నారు తప్పా విడిపించలేదు. గోవిందమ్మ అరుపులు, కేకలు విన్న కుమారుడు తన తల్లిని చంపివేస్తున్నారంటూ పెద్దకడుబూరు ఎస్ఐ నిరంజన్‌రెడ్డికి ఫోన్ చేసి చెప్పాడు. దీంతో ఎస్ఐ వెంటనే తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నాడు. గోవిందమ్మను విడిపించి పోలీసు జీపులో ఎక్కించుకొని స్టేషన్‌కు తరలించాడు. అక్కడి నుంచి బాధితురాలిని ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిం చారు. గోవిందమ్మ ఫిర్యాదు మేరకు పెద్దకడుబూరు ఎస్ఐ పది మందితోపాటు మరికొంత మందిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషయం తెలుసు కున్న దళిత సంఘాలు భగ్గుమన్నాయి. దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ నాయకులు సీఐ మంజు నాథ్‌ను కలిసి కోరారు. అలాగే ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గోవిందమ్మను పరామర్శించారు. నింది తులను అరెస్టు చేయా లని కేవీపీఎస్, ఏపీఎమ్మార్పీఎస్, నవ్యాంధ్ర ఎమ్మా ర్పీఎస్ ఆధ్వర్యంలో ఎమ్మిగ నూరు పట్టణంలో ఆందోళన నిర్వహించారు.



చికిత్స పొందుతున్న గోవిందమ్మ

ప్రత్యేక పూజల్లో రాఘవ లారెన్స్

మంత్రాలయం, సెప్టెంబరు 13: మంత్రాలయం రాఘవేంద్రస్వామిని సినీ హీరో, డాన్స్‌మాస్టర్ రాఘవ లారెన్స్ శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవేంద్రస్వామి తపస్సు చేసిన పంచముఖ ఆంజనేయస్వామి, ఇచ్చాలలో వెలసిన ఏకశిల బృందావనం, అప్పన్నాచార్ బృందావనం, పురాతన నివాసాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అక్కడే కొలువుదీరిన గణనాథులను దర్శించుకుని వినాయక భక్త బృందంతో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా రాఘవ లారెన్స్ మాట్లాడుతూ చెన్నై సమీపంలో 20 ఎకరాల స్థలంలో రాఘవేంద్రస్వామి బృందావనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇందు కోసం స్థల పరిశీలన పూర్తయిందని, త్వరలో ఆర్కిటెక్ట్ శిలామండప నిపుణులతో చర్చించి పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కాంచన-4 చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు ఆయన వివరించారు.



వినాయకుడిని దర్శించుకుంటున్న రాఘవ లారెన్స్

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 13: జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ఉద్యోగ మేళా పోస్టర్లను కలెక్టర్‌తో పాటు జేసీ డా.బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 20న నగరంలోని సిల్వర్‌జూబ్లీ ప్రభుత్వ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 6 ప్రైవేటు కంపెనీలలో ఉన్న 500 ఖాళీ ఉన్నాయని, 18 నుంచి 35 సంవత్సరాలలోపు వయసు కలిగి పది, ఇంటర్, డిగ్రీ, పీజీ చదివిన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎల్ అండ్ టీ కంపెనీలో ఉన్న 120 ఖాళీల భర్తీ కోసం ఎస్పీ కాంప్లెక్స్ సమీపంలోని ఎస్టీబీసీ కళాశాల దగ్గర ఈ నెల 18న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 8688030375, 9059524482, 7780478910 నెంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్వో చిరంజీవి, సీపీవో హిమప్రభాకర్ రాజు, డీఆర్‌డీఏ పీడీ సలీంబాషా, ఉపాధి కల్పన అధికారి దీప్తి, నైపుణ్యాభివృద్ధి శిక్షణా అధికారి శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

చిప్పగిరి, సెప్టెంబరు 13 : మండల కేంద్రానికి చెందిన కురువ కురుమంచప్ప అనే వ్యక్తి గురువారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఆలూరు సీఐ శ్రీనివాస్ నాయక్ వివరాల మేరకు.. బట్టలు లాండ్రీకి ఇవ్వడానికి గురువారం సాయంత్రం కారు మంచప్ప ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేశారు. ఫోన్ రింగ్ అవుతున్న ఎత్తకపోవడంతో ఆయన కుమారులు గుంతకల్లు, ఆ వైపు ఉన్న తమ పొలాల వెంట గాలించారు. చివరకు హంద్రీనీవా కాలువ దగ్గరలో ఉన్న గోడౌన్ వద్ద కౌలుకు తీసుకుని సాగు చేస్తున్న పొలంలో చెట్టుకు ఉరి వేసుకొని కనిపించాడు. సంఘటనా స్థలాన్ని పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్య పరిశీలించారు. జాగిలాలు, పరిశీలన బృందాలతో కారు మంచప్ప ఉరి వేసుకున్న మృతి చెందిన ప్రాంతాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. ఆత్మహత్య చేసుకున్నాడా లేక ఎవరైనా చంపి అక్కడ చెట్టుకు వేలాడ తీశారా అన్న కోణంలో విచారణ చేపట్టారు. చిప్పగిరి ఎస్సై రమేష్ బాబు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ముగ్గురు కూతురులు కాగా అందరికీ పెళ్లిళ్లు చేశాడు.



కారు మంచప్ప (ఫైల్)

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

బనగానపల్లె, సెప్టెంబరు 13: బనగానపల్లె పట్టణంలో ఇటీవల సప్తగిరి లాడ్జిలో జరిగిన చోరీ కేసులో శుక్రవారం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బంగారును స్వాధీనం చేసుకున్నారు. సీఐ కృష్ణయ్య తెలిపిన వివరాలివీ.. అవుకు మండలం రామాపురం గ్రామానికి చెందిన దానమయ్య అనే వ్యక్తి భార్య చనిపోవడంతో చెడువ్యవసనాలకు బానిసై జులాయిగా తిరుగుతున్నాడు. బనగానపల్లె పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా సప్తగిరి లాడ్జి నిర్వహిస్తున్న పార్వతి అనే మహిళ ఈనెల 6న లాడ్జికి తాళాలు వేస్తుండగా అకస్మాత్తుగా హెల్మెట్ ధరించి వచ్చిన దానమయ్య ఆమె తలను గోడకేసి కొట్టాడు. బంగారు గొలుసు, కమ్మలను తీసుకొని బైకుపై పారిపోయాడు. గట్టిగా అరిస్తే ఉరివేస్తానని బెదిరించాడు. ఆ తర్వాత పార్వతమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడు దానమయ్యను గుర్తించారు. బంగారు కమ్మలు అమ్మినట్లు గుర్తించామని సీఐ తెలిపారు. అవుకు రహదారిలోని గోదాము వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులను చూసి మోటారు సైకిల్‌పై వస్తున్న దానమయ్య పారిపోవడానికి యత్నించాడు. అయితే పోలీసులు వెంబడించి దానమయ్యను అదుపులోకి తీసుకున్నారు.

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

HOUSE FOR SALE
కర్నూలులోని, క్రిష్ణానగర్ ITC దగ్గర, రామ్‌రహీమ్ నగర్ 1లో 20x40 సైజు లో క్రింద మరియు పైన కట్టబడిన ఇల్లు అమ్మకమునకు కలదు. (ఉత్తరం-తూర్పు కార్నర్ బిట్టు, రెండువైపుల రోడ్డు) సంప్రదించండి. 98452 04862, 95024 39640.
AJL- 195794

PLOT FOR SALE
R.R రియల్ ఎస్టేట్ వారి న్యూ లాంచింగ్ వెంచర్ అరుణాచల ఐ కాన్ సిటీ, కర్నూలు @ ఓర్వకల్ పవర్ గ్రిడ్ దాటిన తర్వాత NH హైవేకి ఆనుకొని H.కొట్టాల బస్ షెల్టర్ ఎదురుగా (26.5x50) 3 సెంట్ల ప్లాటు కేవలం 11 లక్షలకే సంప్రదించండి. A.శ్రీనివాస్. సెల్ : 91828 21014.
AJL- 195796

WANTED
ప్రముఖ కంపెనీలో పనిచేయుటకు మండలాల వారిగా మీ సొంత గ్రామంలో పార్ట్‌టైం/ ఫుల్ టైం పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, టీం లీడర్స్, టెలీకాలర్స్ కావలెను. అర్హత : S.S.C., Inter, ఏదైనా డిగ్రీ. సంప్ర : 85003 53549, 85003 53548.
AJL-202655

WANTED
SR Defence Academy తిరుపతి నందు పనిచేయుటకు అనుభవజ్ఞులైన PRO's మరియు JL's and Wardens కావలెను. Qual : Any Degree. Cell: 78933 18282, 90008 52892.
AJT-4282

CHANGE OF NAME
I, SIREVELLA VENKATASWAR REDDY (Old Name) R/o.H.No: 80-106-A2, Krishna Nagar, Kallur, Kurnool dist-518003, AP., have changed my name as SIREVELLA VENKATE SWARA REDDY (New Name)
AJL-195825


CHANGE OF NAME
I, THATIKUNTA LAKSHMI DEVI (Old Name) R/o.H.No:3-121, Ramalayam Street, Veldurthy, Kurnool dist, AP., have changed my name as THATIKUNTA NAGENDRAMMA (New Name) W/o.THATIKUNTA EDIGA SRINIVASA GOUD
AJL-195664

CHANGE OF NAME
I, SNEHA VELURU (Old Name) W/O PAVAN REDDY VELURU, R/of H.NO : 45/142-26c-11, Ramalingeswar Nagar, Venkataramana Colony, Kallur (M), Kurnool Dt, AP -518003. I have changed my name to GUNDREDDY SILPA DEVI (New Name) W/O PAVANREDDY VELURU.
AJL-202701

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర॥ 7382114647
AJA-198071

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన/ క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

Andhra Jyothi Classifieds
ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్ కేవలం 240 రూ॥లు
ప్రతి అదనపు లైను 45 రూ॥లు మాత్రమే
* కంప్యూటర్ శిక్షణ
* రియల్ ఎస్టేట్
ఆంధ్రజ్యోతి కార్యాలయం :
నియర్ ఇండస్ స్కూల్, పందిపాడు గ్రామం, కర్నూలు.
సెల్ : 9985411369



కర్నూలు : 99854 11141, 99854 02424, 99854 02544, 97036 18696, 99854 02890, 99591 77333,
ఆదోని : 97036 18726, ఎమ్మిగనూరు : 78931 48646,
నంద్యాల : 99854 02121, డోన్: 94911 02749
నందికొట్కూరు : 83092 18935

పల్లకిలో విహరించిన మహానందీశ్వరుడు

మహానంది, సెప్టెంబరు 13: మహానంది క్షేత్రంలో శుక్రవారం రాత్రి మహానందీశ్వరుడు, కామేశ్వరీదేవి ఉత్సవమూర్తులను పల్లకిలో ఊరేగింపు నిర్వహించారు. ముందుగా కల్యాణ మండపంలో ఉత్సవమూర్తులకు వేదపండితులు ప్రత్యేక పూజలు జరిపారు. భక్తుల శివనామస్మరణ మధ్య మేళతాళాలతో ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు శశిధర్‌రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నూరే హరినాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి : డీఎస్పీ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ రామాంజి నాయక్

ఆత్మకూరు, సెప్టెంబరు 13: కళాశాల విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ సూచించారు. శుక్రవారం ప్రగతిశీల విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో రూపొందించిన ఓ విద్యార్థి చదువుకో.. గమ్యాన్ని చేరుకో పోస్టర్‌ను డీఎస్పీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల స్థాయిలో విద్యార్థులు చెడు వ్యసనాలు, అలవాట్లకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. విద్యార్థులు కృషి, పట్టుదల, శ్రమతో లక్ష్యాల వైపు ముందుకు సాగాలని తెలిపారు. ప్రత్యేకించి విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి వెళ్లరాదని, ఆన్‌లైన్ గేమ్స్, చాటింగ్‌లకు పాల్పడి నష్టపోవద్దని సూచించారు. ఆదేవిధంగా న్యాయ చట్టాలు, సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ర్యాగింగ్ జోలికెళ్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రమణ్యం తదితరులున్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం: సీడీపీవో



విద్యార్థినులతో కలిసి సైకిల్ ర్యాలీ చేస్తున్న సీడీపీవో లీలావతి దేవి

బండిఆత్మకూరు, సెప్టెంబరు 13: యుక్త వయస్సులో ఉన్న పిల్లలు పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీవో లీలావతి దేవి అన్నారు. శుక్రవారం పౌష్టికాహార వార్షికోత్సవాల్లో భాగంగా బండిఆత్మకూరు హైస్కూల్ విద్యార్థులతో కలిసి సీడీపీవో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతను పాటించాలన్నారు. శరీరానికి కావాల్సి పౌష్టికాహారం తీసుకుంటే రోగాలకు దూరంగా ఉండవచ్చని తెలిపారు. పౌష్టికాహారంతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ వర్కర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏపీ మోడల్ స్కూల్‌లో పోషన్ మాసోత్సవం

మిడుతూరు, సెప్టెంబరు 13 : మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో పోషన్ మాసోత్సవ కార్యక్రమం ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రేణుకాదేవి, వరలక్ష్మీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ సుజాత, ఎంఈవో ఫైజున్నిసా బేగం, ప్రిన్సిపాల్ సలీం బాష హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు పోషక ఆహారం కలిగిన ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు తీసుకొని ఆరోగ్యవంతంగా ఉండాలని సూచించారు. సీజనల్ వ్యాధులు రాకుండా విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఏసేపు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాగులో బండి బోల్తా.. కాడెద్దులు మృతి



బోయరేవుల గ్రామంలో వాగులో మృతి చెందిన ఎద్దులు

వెలుగోడు, సెప్టెంబరు 13: వాగులో ఎద్దుల బండి బోల్తా పడి కాడెద్దులు మృతి చెందాయి. రైతు ప్రాణపాయం నుంచి బయట పడ్డాడు. ఈ ఘటన వెలుగోడు మండలంలో శుక్రవారం చోటు చేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి. వెలుగోడు పట్టణానికి చెందిన వెంకటరమణ, రామయ్య అనే రైతులు బోయరేవుల గ్రామంలోని ఓ రైతుకు చెంది న పొలంలో వ్యవసాయ పనుల నిమిత్తం బాడుగకు వెళ్లారు. గ్రామ శివార్లలో రామయ్య ఎద్దుల బండి వాగు దాటగా, వెనుక వస్తున్న వెంకటరమణ ఎద్దులు భయపడి వాగులోనే పరుగులు తీశాయి. దీంతో బండి వాగులోనే బోల్తా పడింది. ఎద్దులు నీటిలో ఊపిరి ఆడక మృతి చెందాయి. రైతు వెంకటరమణను సహచర రైతులు కాపాడారు. కాడెద్దులను 15 రోజుల క్రితం రూ. లక్ష యాభై వేలకు కొనుగోలు చేసినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

ట్రాక్టర్ బోల్తా పడి..



మృతి చెందిన ఆదాము

పాములపాడు సెప్టెంబరు 13: ట్రాక్టర్ బోల్తా పడిన సంఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకున్నది. మండలంలోని బానకచెర్ల, వేంపెంట రహదారి మధ్య బిల్కురాయితో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడటంతో వెలుగోడు మండలం మోతుకూరు గ్రామానికి చెందిన డ్రైవర్ ఆదాము (45) మృతి చెందాడు. స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా సంఘటన స్థలానికి చేరుకొని పోలీసులకు ఫిర్యాదు చేసి మృతదేహాన్ని తీసుకెళ్లారు.

'స్వచ్ఛతా హి సేవా'ను జయప్రదం చేయాలి

నంద్యాల రూరల్, సెప్టెంబరు 13: స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నంద్యాల ఎంపీడీవో సుగుణశ్రీ కోరారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో పలు ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 17నుంచి అక్టోబరు 2 వరకు నిర్వహించనున్న స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలను విజయవంతం చేయడానికి ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని 17 గ్రామాలకు ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ప్రతి అధికారి పని చేయాలన్నారు. సమావేశంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మధు కాలేజ్ ఆఫ్ నర్సింగ్
బొమ్మల సత్రం, నంద్యాల.
అడ్మిషన్లు జరుగుచున్నవి
4 సం॥ ల B.Sc., నర్సింగ్ కోర్సు.
అర్హత : ఇంటర్ BI.PC., మరియు ఒకేషనల్ నర్సింగ్ పాసైన విద్యార్థినీ, విద్యార్థులు.
ఈ ఏపిసెట్ అర్హత సాధించిన వారు అర్హులు.
2 సం॥ ల (Post Basic B.Sc.,) నర్సింగ్ కోర్సు
అర్హత : G.N.M పాస్ అయిన విద్యార్థి, విద్యార్థినీలు.
1 సం॥ హెల్త్ శానిటరి ఇన్‌స్పెక్టరు కోర్సు
అర్హత : SSC పాస్
(అర్హత ఉన్నవారికి స్కాలర్‌షిప్ కలదు)
చివరి తేదీ : 17.09.2024
జె.రామచంద్రారెడ్డి, ఛైర్మెన్
సెల్ : 98486 06835

సాంకేతిక విద్యను అభ్యసించాలి

- మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్



విద్యార్థినులకు కంప్యూటర్‌ను అందజేస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల రూరల్, సెప్టెంబరు13: సాంకేతిక విద్యా విజ్ఞానాన్ని అలవర్చుకోవాలని రాష్ట్ర న్యాయ శాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. శుక్రవారం నంద్యాల ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో ఉర్దూ అకాడమీ ద్వారా ఐదు కంప్యూటర్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఉన్నత విద్యను అందించడం కోసం ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందన్నారు. కంప్యూటర్ యుగంలో ప్రతి ఒక్కరూ సాంకేతికతను అభ్యసించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. కంప్యూటర్లను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు.

నంద్యాలలో లా కళాశాల ఏర్పాటు చేయాలి

నంద్యాల జిల్లా కేంద్రంలో లా కళాశాల, కేంద్రీయ విద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ఆల్ మేవా రాష్ట్ర గౌరవాధ్యక్షుడు అబులైస్, జిల్లా అధ్యక్షుడు ఇమ్రాన్‌పాషా డిమాండ్ చేశారు. శుక్రవారం నంద్యాలలో మంత్రి ఎన్ఎండి ఫరూక్‌ను ఆల్ మేవా నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉర్దూ కళాశాల భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని, కళాశాలలో ప్రస్తుతం పని చేస్తున్న వారిని కాంట్రాక్ట్ అధ్యాపకులుగా నియమించాలని కోరారు. ఆల్ మేవా నాయకులు మంత్రి దృష్టికి పలు సమస్యలు తీసుకు రావడంతో పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆల్ మేవా వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. శుక్రవారం నంద్యాలలోని ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్‌డే కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాలను చేరుకునే విధంగా పట్టుదల, క్రమశిక్షణతో కష్టపడా లని సూచించారు. తల్లిదండ్రులు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో డీవీఈవో సునీత, ఉర్దూ కాలేజి ఇన్‌స్పెక్టర్ అస్మద్దీన్, కళాశాల ప్రిన్సిపాల్ కరిముల్లా, ప్రభుత్వ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ సోమశేఖరప్ప, కందుకూరి శ్రీరామమూర్తి, బాలచంద్రుడు, మణియార్ ఖలీల్ పాల్గొన్నారు.

కుటీర పరిశ్రమతో మహిళల ఆర్థికాభివృద్ధి

- స్వయం సహాయక సంఘాల నిర్మాత చంద్రబాబు
- నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య



మహిళలు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

నందికొట్కూరు, సెప్టెంబరు 13: కుటీర పరిశ్రమలతో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. శుక్రవారం నందికొట్కూరు పట్టణంలో పొట్టి శ్రీరాములు విగ్రహం సమీపంలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సూపర్ బజార్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయ సంఘాలను ఏర్పాటు చేసి మహిళల ఆర్థికాభివృద్ధికి పునాదులు వేసిన మహనీయుడు చంద్రబాబునాయుడే అని కొనియాడారు. మహిళలకు ఆర్థిక స్వాలంబన ఎప్పుడు కలుగుతుందో అప్పుడే కుటుంబ అభివృద్ధి, ఆ తర్వాత సమాజాభివృద్ధి జరుగుతుందన్న ఉద్దేశంతోనే స్వయం సహాయక సంఘాలను నాడు ఏర్పాటు చేశారన్నారు. గత ప్రభుత్వంలో స్వయం సహాయక సంఘాలపై జగన్మోహన్‌రెడ్డి సీతకన్ను వేశారన్నారు. నేటి ప్రభుత్వ హయాంలో చిన్నతరహా పరిశ్రమలతో మహిళలు అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బేబి, మెప్మా టీఎంసీ శాంతకుమారి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్ చిన్న రాజు, టీడీపీ నాయకులు ముర్తుజావలి, లాయర్ జాకీర్, పలుచాని మహేశ్వర్‌రెడ్డి, జమీల్, సౌదీ చాంద్, తదితరుల పాల్గొన్నారు.

మల్లన్న సేవలో ఎమ్మెల్యే



ఆలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

శ్రీశైలం, సెప్టెంబరు 13: శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మ వార్లను శుక్రవారం శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న ఎమ్మెల్యేకు అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. రత్న గర్భగణపతి స్వామిని ఎమ్మెల్యే దర్శించుకున్నారు. అనంతరం మల్లికార్జునస్వామికి అభిషేకం నిర్వహించారు. తరువాత భ్రమరాంబికాదేవి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దర్శనానంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో ఎమ్మెల్యే రాజశేఖరరెడ్డికి వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థప్రసాదాలను అందజేశారు. స్వామి, అమ్మవార్ల దర్శనానంతరం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి స్థానిక సత్ర సమాఖ్య అధ్యక్షులు, కార్యదర్శులతో స్థానిక వాసవి సత్రము నందు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వియవాడ వరద బాధితుల సహాయార్థం ఉదారస్వభావంతో విరాళాలు అందజేయాలని ఎమ్మెల్యే కోరారు. సత్రనిర్వాహకులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ప్రణాళికబద్ధంగా పరిష్కరిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ మండల ఇన్‌చార్జి యుగంధర్ రెడ్డి, శ్రీశైలం ఇన్‌చార్జి శ్రీనివాసరెడ్డి, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

వైభవంగా స్వామి, అమ్మవార్లకు ఊయల సేవ



స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలం, సెప్టెంబరు 13: శ్రీశైలం మహాక్షేత్రంలో లోకకల్యాణార్థం శుక్రవారం స్వామి, అమ్మవార్లకు ఊయల సేవను కన్నుల పండువగా నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ముందుగా మహాగణపతి పూజను చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ఊయలలో ఆశీనులనుజేసి శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్ర నామపూజలు, స్వామివారికి సహస్ర నామార్చన పూజలు నిర్వహించి మంగళ హారతులను సమర్పించారు.

గ్రామ దేవత అంకాలమ్మకు విశేష పూజలు

శ్రీశైల క్షేత్ర గ్రామదేవత అంకాలమ్మకు శుక్రవారం లోకకల్యాణాన్ని ఆకాంక్షిస్తూ విశేష పూజలను దేవస్థానం నిర్వహించింది. ఈ పూజలలో భాగంగా అమ్మవారికి పంచామృతాభిషేకం, హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, పుష్పోదకం, విశేష అలంకరణ, కుంకుమార్చన పూజలు నిర్వహించారు.

ఆకట్టుకున్న నిత్య కళారాధన

శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో శుక్రవారం వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్సు అకాడమీ, శ్రీకాకుళం బృందంతో సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మహాగణపతిం, శివతాండవం, శివశివ శంకరా, శివపంచాక్షరీ స్తోత్రం, నమశశివాయతే తదితర గీతాలకు వెంకటేశ్వర పట్నాయక్, కావ్య, శైలు, జయలక్ష్మీ, శ్వేతారాణి, లక్ష్మీ, ప్రీతి, శ్రీదీక్షిత, ప్రణవి, స్నేహశ్రీగౌడ్, మధుశ్రీ, సింధు తదితరులు నృత్యప్రదర్శనతో అలరించారు.



నృత్యం చేస్తున్న కళాకారులు

కార్మిక కర్షకుల ఆశాజ్యోతి ఏచూరి



ఆత్మకూరు: సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు, సెప్టెంబరు 13: కార్మిక కర్షకుల ఆశాజ్యోతి సీతారాం ఏచూరి అని సీపీఎం నాయకులు ఏసురత్నం, రణధీర్, స్వాములు, రజాక్ అన్నారు. సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి చెందడంతో శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రామ్‌నాయక్, స్వాములు, సుధాకర్, సద్దాం హుసేన్, దినేష్, వలి, వీరన్న, చాంద్, గణపతి, రాజేష్ తదితరులు ఉన్నారు.

అమలాపురం చెంచు గూడెంలో..

ఆత్మకూరు రూరల్: మండల పరిధిలోని అమలాపురం చెంచు గూడెంలో సీతారాం ఏచూరి చిత్ర పటానికి సీపీఎం నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నరసింహానాయక్, నాయకుడు సుధాకర్, గూడెం గిరిజనులు పాల్గొన్నారు.

శివపురం గ్రామంలో..

కొత్తపల్లి : మండలంలోని శివపురం గ్రామంలోని ఎస్సీ కాలనీలో సీతారామ్ ఏచూరి చిత్రపటానికి సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు యేసురత్నం, నాయకులు స్వాములు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం యేసురత్నం మాట్లాడుతూ ఉన్నత కుటుంబంలో పుట్టిన సీతారాం ఏచూరి అట్టడుగు వర్గాల ప్రజల అభివృద్ధి కోసం జీవితాంతం కృషి చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు దాసు, దానమయ్య, రాజేష్, ప్రేమ్, హనుమంతు, రంగస్వామి, ప్రదీప్, రాములమ్మ, హుశేనమ్మ, మాణిక్యమ్మ, శేషమ్మ పాల్గొన్నారు.

జై కిసాన్ పార్కులో..

నందికొట్కూరు: నందికొట్కూరు పట్టణంలోని జై కిసాన్ పార్కులో ప్రజా సంఘాల నాయకులు, విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శిసీతారాం ఏచూరి సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు నాగేశ్వరరావు, సీపీఐ జిల్లా నాయకుడు రఘురామమూర్తి, విద్యార్థి జేఏసీ నాయకులు శేఖర్ నాయుడు మాట్లాడుతూ సీతారాం ఏచూరి సేవలు మరువలేనివని ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనసేన నాయకులు రామిరెడ్డి, ఏఐటీయూసీ నాయకులు రామృష్ణ, అమర్నాథ్, ఎమ్మార్పీఎస్ నాయకుడు రాజు, జిల్లా కార్యదర్శి ఏపీ మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి రజితమ్మ, కేవీపీఎస్ నాయకులు రంగమ్మ, జయరాణి, తదితరులు పాల్గొన్నారు.

బండి ఆత్మకూరులో..

బండిఆత్మకూరు: మండల కేంద్రంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి సీపీఎం నాయకులు రత్నమయ్య, డేవిడ్, వ్యకాస నాయకులు రామచంద్రుడు, సుబ్బయ్య, కేవీపీఎస్ నాయకుడు ఏసు, ఎమ్మార్పీఎస్ నాయకులు వెంకట సుబ్బన్న పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గడివేముల మండల కేంద్రంలో..

గడివేముల: మండల కేంద్రంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి సీఐటీయూ, ఆటో యూనియన్ నాయకులు సోమన్న, బాలు పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు గోకార్‌సా, ఆర్య, రామకృష్ణ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ కార్యాలయంలో..

పాణ్యం: స్థానిక సీఐటీయూ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి సీపీఎం నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, బషీర్, రామచంద్రుడు, సుదర్శన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్ర టెలికాం సలహా కమిటీ సభ్యుల నియామకం



పాములపాడుకు చెందిన రమేశ్‌కు నియామకపత్రాన్ని అందిస్తున్న ఎంపీ బైరెడ్డి శబరి

నంద్యాల రూరల్/పాములపాడు, సెప్టెంబరు 13 : నంద్యాల పార్లమెంట్ పరిధిలోని కేంద్ర ప్రభుత్వ టెలికమ్యూనికేషన్ మంత్రిత్వ శాఖ బీఎస్ఎన్ఎల్ సలహా కమిటీ సభ్యులను నియమించారు. శుక్రవారం నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి పాములపాడుకు చెందిన కురువ రమేష్, పాణ్యంకు చెందిన శ్రీనివాసయాదవ్, కల్లూరుకు చెందిన మధు, ఆత్మకూరుకు చెందిన గౌస్‌లాజం, నంద్యాల నూనెపల్లెకు చెందిన పెరుమాళ్ల విజయ్ కుమార్‌కు నియామక పత్రాలను అందజేశారు. ఎన్నికైన కమిటీ సభ్యులు ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.

మాండ్ర గిడ్డారెడ్డికి ఘననివాళి

నందికొట్కూరు రూరల్, సెప్టెంబరు 13: నందికొట్కూరు మండలంలోని అల్లూరు గ్రామంలో టీడీపీ నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గ నాయకుడు మాండ్ర శివానందరెడ్డి తండ్రి మాండ్ర గిడ్డారెడ్డి వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య, మాండ్ర సురేంద్రనాథరెడ్డి టీడీపీ నాయకులు మాండ్ర గిడ్డారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఏంపీపీ పాఠశాలలో విద్యా ర్థులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రసాదరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, పాఠశాల కమిటీ ఛైర్మన్ మౌలాలి, సయ్యద్, శ్రీనివాసులు గ్రామస్థులు పాల్గొన్నారు.

'ఉద్యోగ భద్రత కల్పించాలి'

నంద్యాల రూరల్, సెప్టెంబరు 13 : జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న ఆప్కాస్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగ రాముడు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ బాధ్యతలు చేపట్టి 20 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు జీతాలు మంజూరుకాక ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నియామకాలు జరిగినప్పటి నుంచి జీతాలు రాకపోయినా డీఎంహెచ్‌వో, డీసీహెచ్ఎస్, ఆస్పత్రి సూపరింటెండెంట్లు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

అర్చకుడికి సన్మానం

మహానంది,సెప్టెంబరు 13: మహానంది సమీపంలోని తెలుగుగంగ ప్రధాన కాల్వ వద్ద ఏర్పాటు చేసిన వినాయక ఘాట్ అర్చకుడు రామయ్యను మండల గణేశ్ కమిటీ సభ్యులు శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో గణేశ్ ఉత్సవాల కమిటీ మండల అధ్యక్షుడు కంచెర్ల శివ, సభ్యులు గడ్డం నాగపుల్లయ్య, నాగరాజు, భూమా సుబ్బరామయ్య, కాకర్ల శివ పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళం



ఎమ్మెల్యేకు విరాళాన్ని అందజేస్తున్న రాంపుల్లారెడ్డి

పాణ్యం, సెప్టెంబరు 13: వరద బాధితుల కోసం టీడీపీ పాణ్యం మండల మాజీ కన్వీనర్ రాంపుల్లారెడ్డి ఎమ్మెల్యే గౌరు చరితకు విరాళం అందజేశారు. శుక్రవారం ఆయన ఎమ్మెల్యే నివాసంలో రూ. 50 వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా రాంపుల్లారెడ్డిని ఎమ్మెల్యే అభినందించారు.

బుక్కాపురంలో..

మహానంది: వరద వల్ల నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు మహానంది మండలం బుక్కాపురంలో టీడీపీ నాయకులు మారెడ్డి జయరాం ఆధ్వర్యంలో శుక్రవారం విరాళాలను సేకరించారు. గ్రామంలో ఇంటింటా తిరిగి ప్రజల నుంచి విరాళాలు సేకరించారు. వచ్చిన మెత్తాన్ని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ద్వారా సీఎం సహాయ నిధికి పంపనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సాయిబాబా, చిన్నరాముడు, చంద్రశేఖర్ సాంబమూర్తి శ్రీనివాసులు పాల్గొన్నారు. అలాగే టీడీపీ నాయకుడు కంచెర్ల శివ, గడ్డం నాగపుల్లయ్య, మారెడ్డి సుబ్రమాణ్యం, గుద్దేటి నాగరాజు ఆధ్వర్యంలో గ్రామంలో విరాళాలను సేకరించారు.

బండి ఆత్మకూరు మండంలో..

బండిఆత్మకూరు: మండలంలోని పలు గ్రామాల్లో వరద బాదితుల కోసం టీడీపీ నాయకులు విరాళాల సేకరణ ముమ్మరగా చేపట్టారు. ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ఆదేశానుసారం శుక్రవారం ఏ కోడూరు టీడీపీ నాయకులు వడ్డు మధుసూధన్‌రెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్ దేరెడ్డి శ్రీనివాసరెడ్డి, మోహన్‌రెడ్డి, శివకుమార్, శంకర్‌రెడ్డి ఇంటింటా తిరుగుతూ విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో కుమార్, విద్యాకమిటీ ఛైర్మన్ సుబ్రమణ్యం, పలు గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు

నంద్యాల రూరల్, సెప్టెంబరు 13: ప్రభుత్వం నాణ్యమైన విద్యుత్‌ను వినియోగదారులకు అందించాలన్న ఉద్దేశంతో స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు నంద్యాల పట్టణ డీఈఈ రమేష్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో సుమారు లక్షకు పైగా విద్యుత్ సర్వీసులు ఉన్నాయన్నారు. మూడు రోజుల నుంచి వివిధ శాఖల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో 260 స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేశామన్నారు. పట్టణంలో మూడు సెక్షన్లలో ఒక్కో సెక్షన్ కింద రోజుకు 500 మీటర్లు అమర్చాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. మూడు నెలలలోపు కనెక్షన్ల అమరికను పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. వినియోగదారులు స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. అమరిక కోసం వచ్చిన సిబ్బందికి సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నంద్యాల రూరల్, సెప్టెంబరు 13: పట్టణంలో మరమ్మతుల కారణంగా సెక్షన్ డీ -2, డీ-3 పరిధిలో విద్యుత్ సరఫరాను శనివారం నిలిపివేస్తున్నట్లు డీ-2 ఏఈ రామయ్య, డీ-3 ఏఈ రవికుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. డీ - 2 పరిధిలో పద్మావతినగర్, ఎస్‌బీఐ కాలనీ, నూనెపల్లె, ఎన్‌జీ వోస్ కాలనీ, సాయిబాబానగర్ తదితర ప్రాంతాలలో, డీ-3 పరిధిలో ఆటో నగర్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

వ్యక్తికి రిమాండ్

కొత్తపల్లి, సెప్టెంబరు 13: భార్యపై దాడి చేసి గాయపరిచిన భర్తను కొత్తపల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ కేశవ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని బండనాయునిపాలెం గ్రామానికి చెందిన తలారి శివలింగానికి 13 ఏళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన బాలన్న కుమార్తె జ్యోతిని ఇచ్చి వివాహం చేశారు. పెళ్లయిన కొన్నేళ్ల వరకు వారి కాపురం సజావుగా సాగింది. అయితే ఇటీవల శివలింగం ఆర్థిక పరిస్థితుల కారణంగా తరుచూ భార్యపై గొడవపడి దాడి చేసేవాడు. దాంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ నేపథ్యంలో ఈ నెల 5న పుట్టింట్లో భార్య ఒంటరిగా ఉందని తెలుసుకుని శివలింగం దాడి చేసి గాయపరిచాడు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్తను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా.. మేజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్ఐ వెల్లడించారు.

సారా కేసులో ఇద్దరి అరెస్టు

- 30 లీటర్ల సారా స్వాధీనం.. బైక్ సీజ్

కొత్తపల్లి, సెప్టెంబరు 13: మండల పరిధిలోని బావాపురం గ్రామ శివారులో బైకుపై సారా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ కేశవ శుక్రవారం తెలిపారు. ఆత్మకూరు మండలం సిద్ధాపురం గ్రామానికి చెందిన ఈసం సంతోష్, ఇరుకదిండ్ల రవి బైక్‌పై 30 లీటర్ల సారాను తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. సారా, బైక్‌ను సీజ్ చేశామని తెలిపారు. అలాగే నదురు వ్యక్తులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా.. మేజిస్ట్రేట్‌కు రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆయకట్టుకు అందని నీరు

» పది రోజుల క్రితం గంగబ్లాక్ చానల్ 19వ ఉప కాలువకు గండి
» పట్టించుకోని అధికారులు, పాలకులు
» సాగు నీటి కోసం ఎదురు చూస్తున్న రైతులు


19వ గంగ ఉప కాలువకు గండి పడిన దృశ్యం

రుద్రవరం, సెప్టెంబరు 13 : తెలుగుగంగ ప్రధాన కాలువ చెంతనే ఉన్నా.. సాగునీరు కోసం రైతులు ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొంది. గంగబ్లాక్ చానల్ 19వ ఉపకాలువకు గండిపడి సుమారు పదిరోజులపైనే అయింది. అటు గంగ అధికారులు కానీ, ప్రజాప్రతినిధులు కానీ పట్టించుకోవడం లేదని రైతులు వాపోయారు. చెంతనే కాల్వల్లో సాగునీరు పారుతున్నా నీరు మాత్రం ఆయకట్టుకు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఉపకాలువ కింద వెలవలపల్లె చెరువుకు సాగునీరు అందాల్సి ఉంది. అప్పనపల్లె, వెలగలపల్లె, కొండమాయపల్లె గ్రామాల రైతులు ఆయకట్టు భూములు ఈ కాల్వ వెంట ఉన్నాయి. సాగునీరు పుష్కలంగా ఉన్నా సుమారు 500 ఎకరాలకు సాగునీరు అందడం లేదని రైతులు అంటున్నారు. విషయాన్ని ప్రజాప్రతి నిధులకు, గంగ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా పట్టించుకోలేదని రైతులు వాపోయారు.

వెలగలపల్లె చెరువుకు సాగునీరు చేరని వైనం

వెలగలపల్లె గ్రామ సమీపంలో చెరువు ఉంది. ఆ చెరువుకు కూడా సాగునీరు ఉపకాల్వల ద్వారా అందాలి. అధికారులు నిర్లక్ష్యంతో చెరువుకు సాగునీరు అందడంలేదు. చెరువు కింద కూడా సుమారు వంద ఎకరాల ఆయకట్టు, నాన్ ఆయకట్టు భూములున్నాయి. గంగ నీరే ఈ చెరువుకు శరణ్యంగా మారింది.

గండి పడడంతో సాగు నీరు నిలిచిపోయింది


19వ బ్లాక్ చానల్ ఉపకాల్వకు గండి పడింది. పదిరోజులు గడిచింది. ఒక వైపు ముమ్మరంగా వ్యవసాయ పనులు కొనసాగుతున్నాయి. కాల్వ చూస్తే వెలవెలబోతోంది. చెరువులో నీరు లేక ఒట్టిపోయి చెరువు దర్శనమిస్తుంది.

- అబ్బిరెడ్డి, రైతు

సాగునీరందించి ఆదుకోండి


19వ బ్లాక్‌చానల్ ఉప కాల్వకు మరమ్మతులు చేయించాలి. ఈ కాల్వపై 500 ఎకరాల ఆయకట్టు ఉంది. సాగునీ రందక పంటలు సాగు చేయలేక ఇబ్బంది పడుతున్నాం. మరమ్మతులు చేయించి సాగునీరందించాలి.

- లక్ష్మయ్య, రైతు, కొండమాయపల్లె

మరమ్మతులు చేయిస్తాం

గంగ ఉప కాల్వకు మరమ్మతులు చేయిస్తాం. గండి పడిన ప్రాంతాన్ని ఉన్నతాధికారులు కూడా పరిశీ లించారు. త్వరలో మరమ్మతులు చేసి రైతులకు సాగునీరు అందిస్తాం.

- రవీంద్రనాథ్, గంగ ఏఈ

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం


మాట్లాడుతున్న ఆళ్లగడ్డ సీడీపీవో తేజశ్విని

చాగలమర్రి, సెప్టెంబరు 13: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఆళ్లగడ్డ సీడీపీవో తేజశ్విని అన్నారు. శుక్రవారం చాగలమర్రి గ్రామంలోని 13వ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాల గురించి తల్లులకు వివరించారు. పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని అన్నారు. సమావేశంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి నరసింహులు, సూపర్‌వైజర్లు రామలింగారెడ్డి, సుశీల, ఏపీవో నిర్మల, ఏఎన్ఎం లీలావతి, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

దొర్నిపాడు: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తప్పని సరిగా తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ అన్నారు. శుక్రవారం పౌష్టికాహార మాసోత్సవం సందర్భంగా దొర్నిపాడు వెలుగు కార్యాలయంలో మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ గర్భిణులు పండ్లు, ఆకు కూరలు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఏపీఎం బాబు, రజితారెడ్డి, ఏఎన్ఎం వెంకటసుబ్బమ్మ పాల్గొన్నారు.

అతిసార నివారణకు వైద్య శిబిరాలు

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 13: ఆళ్లగడ్డ పట్టణంలో అతిసార వ్యాధి నివారణకు వైద్యాధికారులు వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. అతిసార వ్యాధి పట్టణంలోని కుద్బా వీధి, ఆదర్శ అభ్యుదయ కాలనీ, సద్దాం కాలనీ, చాంద్ వీధి ప్రాంతాలలో కలుషిత నీటి వల్ల ప్రబలింది. ఈ ప్రాంతాలలో బాధితుల సంఖ్య పెరుగుతూనే ఉంది. ఆయా ప్రాంతాలలో వైద్యశిబిరాలను ఏర్పాటు చేసి వైద్య సిబ్బంది చికిత్సలు నిర్వహిస్తున్నారు.

అధికారుల పర్యటన: అతిసార వ్యాధి బారిన పడిన ప్రాంతాలలో జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, ఆర్డీవో మల్లికార్జునరెడ్డి, ఆర్వేడి మూర్తి స్థానిక అధికారులు శుక్రవారం పర్యటించారు. ఆయా ప్రాంతాలలోని ప్రజలకు వేడి పదార్థాలు తీసుకోవాలని, నీటిని వేడి చేసుకొని చల్లార్చి తాగాలని సూచించారు.. ఆయా ప్రాంతాలకు నీటిని అధికారులు పరిశీలించారు. మున్సిపల్ అధికారులు ఆయా ప్రాంతాలకు ట్యాంకుల ద్వారా సరఫరా అయ్యే నీటిని నిలిపి వేసి ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి

డోన్(రూరల్), సెప్టెంబరు 13: సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలని పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా అన్నారు. శుక్రవారం రాత్రి రోటరీ క్లబ్ భవనంలో ప్రైవేటు డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి సీఐ ఇంతియాజ్ బాషా హాజరై మాట్లాడుతూ సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం సీఐ ఇంతియాజ్ బాషాకు శాలువలు, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు చిన్న పిల్లల వైద్యనిపుణుడు డాక్టర్లు శ్రీధర్, గైనకాలజిస్టు సుంకన్న, కర్నూలు ప్రభుత్వ వైద్యశాల వైద్యులు మాధవకృష్ణ, బాలచంద్రారెడ్డి, రాజేంద్రప్రసాద్ రెడ్డి, ముర్తుజావలి పాల్గొన్నారు.

ఇరు వర్గాలపై కేసు నమోదు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 13: మండలంలోని చింతలాయపల్లె గ్రామంలో టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య జరిగిన గొడవకు సంబంధించి 10మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్‌బాబు శుక్రవారం తెలిపారు. టీడీపీకి చెందిన హరిక్రిష్ణ, శ్రీనివాసులుతోపాటు, మరో ముగ్గురు, వైసీపీకి చెందిన ప్రసాద్, ప్రకాష్ మరో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

సారా విక్రేత అరెస్టు

బేతంచెర్ల, సెప్టెంబరు 13: మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన మహిళా సారా విక్రేత గుడిసె రంగమ్మను అరెస్టు చేసి ఆమె వద్ద నుంచి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖరప్ప శుక్రవారం తెలిపారు. రంగాపురం రైల్వేస్టేషన్ సమీపంలో నాటుసారా విక్ర యిస్తున్న గుడిసె రంగమ్మను అరెస్టు చేసి డోన్ కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించిదన్నారు.

డెంగీతో అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, సెప్టెంబరు 13: ప్రస్తుత సీజన్‌లో డెంగీ జ్వరంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యుడు ఇమ్రాన్ సూచించారు. శుక్రవారం మద్దూరు గ్రామంలో ఎఫ్‌డీపీ, డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. రక్త పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, దోమ కాటుకు గురి కాకుండా అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు తెలియజేశారు. కార్యక్ర మంలో ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఉన్నారు.

వరద బాధితులకు కిట్ల పంపిణీ


బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

శిరివెళ్ల, సెప్టెంబరు 13: విజయవాడలోని వరద బాధితులకు నిత్యావసర కిట్లను శుక్రవారం అందించినట్లు టీడీపీ నాయకుడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు యామా గుర్రప్ప తెలిపారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పిలుపు మేరకు శిరివెళ్లలోని దాతల సహకారంతో సేకరించిన నిత్యావసరాలను విజయవాడలోని సింగ్‌నగర్, కండ్రిగ, పాయకరావుపేట ప్రాంతాల్లోని వరద బాధితులకు శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు యామా శ్రీకాంత్, తిరుమల రవి, బ్రహ్మయ్య, వీపీ లింగమయ్య, గోపాల్, దువ్వూరి భాస్కర్, గోవర్ధన్, సతీష్ పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

చాగలమర్రి, సెప్టెంబరు 13: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో పశువులకు సోకే గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయించాలని పశుసంవర్ధక శాఖ ఏడీ వరప్రసాదు సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం చాగలమర్రి పశు వైద్య కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 19 గ్రామ పంచాయతీల్లో ఎద్దులు, ఆవులు, గేదెలకు తప్పని సరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని అన్నారు. కార్యక్రమంలో పశువైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

టీజీపీ నీరు వంకకు మళ్లింపు

చాగలమర్రి, సెప్టెంబరు 13: మండలంలోని శెట్టివీడు గ్రామ పరిధిలో గల 33 బ్లాక్ చానల్ ద్వారా ప్రవహిస్తున్న టీజీపీ నీటిని పంట పొలాల్లో ప్రవహించకుండా వంకకు మళ్లించామని టీజీపీ డీఈ వెంకటరమణ తెలిపారు. శుక్రవారం టీజీపీ బ్లాక్ చానల్‌లో ప్రవహిస్తున్న నీటి ప్రవాహాన్ని ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఏఈ వినయ్‌కుమార్, రైతులు ఉన్నారు.

వైభవంగా వాసవీమాత రథోత్సవం

చాగలమర్రి, సెప్టెంబరు 13: చాగలమర్రిలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి వెండి రథంలో ఊరేగింపు నిర్వహించారు. మహిళలు సామూహికంగా అమ్మవారికి వడి బియ్యం కార్యక్రమం చేశారు. పసుపు, కుంకుమ, గాజులు సమర్పించి కుంకుమార్చన చేశారు. వాసవీమాత పారాయణం చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు లక్ష్మణబాబు, వాసవీ మహిళలు పాల్గొన్నారు.

రూ.1.53 లక్షలు జరిమానా


వాహనాలు తనిఖీ చేస్తున్న డోన్ ఎంవీఐ క్రాంతి కుమార్

బేతంచెర్ల, సెప్టెంబరు 13: అధిక లోడుతో వెళ్తున్న ఏడు వాహనాలపై రూ.1.53 లక్షలు జరిమానా విధించినట్లు డోన్ ఎంవీఐ క్రాంతి కుమార్ తెలిపారు. పట్టణంలోని కర్నూలు, నంద్యాల క్రాస్ రోడ్డులో శుక్రవారం ఆకస్మికంగా వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో అధిక లోడుతో వెళ్తున్న టిప్పర్ వాహనం, పన్నులు చెల్లించకుండా ట్యాంకర్, రెండు ట్రాక్టర్లు, వస్తువులను రవాణా చేయడానికి పర్మిట్ లేని వాహనాలు వస్తువులను తరలించే ఎఫ్‌సీ లేని వాహనాన్ని గుర్తించి వాటిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. రూ.1,53,440 జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు.

చివరి ఆయకట్టుకు సాగు నీరు


కేసీ కాలువ నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న డీఈ బ్రహ్మారెడ్డి

చాగలమర్రి, సెప్టెంబరు 13: మండలంలో చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తున్నట్లు డీఈ బ్రహ్మారెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని రాజోలి ఆనకట్ట వద్ద కేసీకెనాల్, కుందూ నీటి ప్రవాహాన్ని డీఈ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రాజోలి ఆనకట్ట వద్ద 12 వేల క్యూసెక్కులతో కుందూ నీటి ప్రవాహం ఉందన్నారు. కేసీ ప్రధాన కాలువకు 800 క్యూసెక్కుల నీరు విడుదల చేశామని అన్నారు. ఏఈ జమాల్‌వలి, సూపర్‌వైజర్ దస్తగిరి ఉన్నారు.

మొక్కజొన్న పంట గొర్రెలకు..


ముత్తలూరు గ్రామ సమీపంలో గొర్రెలకు వదిలేసిన మొక్కజొన్న పంట

రుద్రవరం, సెప్టెంబరు 13 : మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు మొక్కజొన్న పంట దెబ్బతినడంతో ఓ రైతు గొర్రెలకు వదిలేశారు. శుక్రవారం మండలంలోని ముత్తలూరు గ్రామానికి చెందిన ఈశ్వర్‌రెడ్డి అనే కౌలు రైతు తాను సాగు చేసిన నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న పంటను వర్షాలధాటికి దెబ్బతినడంతో గొర్రెలకు వదిలేశాడు. చేసిందేమీ లేక పెట్టుబడి అంతా నేలపాలైందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

శిరివెళ్ల, సెప్టెంబరు 13: గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలని టీడీపీ మండల కన్వీనర్, మాజీ ఎంపీపీ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి కోరారు. మండలంలోని ఇసుకపల్లె ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన హ్యాండ్‌వాష్ ప్రాంగణాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలన్నారు. అనంతరం శ్రీకాంత్‌రెడ్డిని పాఠశాల యాజమాన్యం, గ్రామస్థులు సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ గురుస్వామి, హెచ్ఎం శ్రీనివాసరెడ్డి, టీడీపీ నాయకులు వెంకటనారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి, హరిశ్చంద్రారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరికి ప్రత్యేక పూజలు

రుద్రవరం, సెప్టెంబరు 13: రుద్రవరంలో కొలువుదీరిన కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. తరలివచ్చిన ఆర్యవైశ్యులు ప్రత్యేక పూజలు చేశారు. పూజలనంతరం తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు.

'స్వచ్ఛతా హి సేవా'ను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 13: మండలంలోని అన్ని గ్రామాల్లో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల కార్యదర్శులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి అక్టోబరు ఒకటి వరకు ప్రతీ గ్రామంలో ప్రత్యేక స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అన్నిశాఖల అధికారులను భాగస్వాములను చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో ఈవోపీఆర్డీ మహీందర్‌రెడ్డి, ఉపాధి ఏపీవో రవిప్రకాష్ పాల్గొన్నారు.

'విద్యా వ్యవస్థ బాగుంటేనే సమాజాభివృద్ధి'



మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

కోవెలకుంట్ల, సెప్టెంబరు 13: విద్యావ్యవస్థ బాగుంటేనే సమాజం బాగుంటుందని, అభివృద్ధి చెందుతుందని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. శుక్రవారం కోవెలకుంట్ల పట్టణంలోని పట్టణంలోని శ్రీవాసవీబొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల వార్షికోత్సవం, ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బీసీ రాజారెడ్డి మాటాడుతూ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డితో మాట్లాడి కళాశాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. విద్యార్థులు ఉన్నత విద్యలు చదివి గమ్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి కనబరచాలి

దొర్నిపాడు, సెప్టెంబరు 13: గ్రామాల్లోని విద్యార్థులు క్రీడల పట్ల అసక్తి కలిగి ఉండాలని దొర్నిపాడు జడ్పీహెచ్ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ సుధాకర్ అన్నారు. శుక్రవారం దొర్నిపాడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలను ప్రధానోపాధ్యాయురాలు జయలక్ష్మి, ఎస్ఎంసీ చైర్మన్ సుధాకర్ ప్రారంభించారు. వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ తదితర ఆటల పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో పీఈటీ దేవేంద్ర, శ్రీధర్, బాలకృష్ణ, సరళ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి మృతి పార్టీకి తీరని లోటు



బేతంచెర్లలో ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

డోన్(రూరల్), సెప్టెంబరు 13: సీపీఎం జాతీయ నాయకుడు సీతారాం మృతి పార్టీకి తీరని లోటు అని సీపీఎం నాయకులు అన్నారు. శుక్రవారం సీపీఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. నాయకులు కోయలకొండ నాగరాజు, నక్కి శ్రీకాంత్, శివరాం, రామాంజనేయులు, నరసింహులు పాల్గొన్నారు. అలాగే సీపీఐ కార్యాల యంలో ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. నాయకులు సుంకయ్య, రాధాకృష్ణ, నారాయణ షమీమ్ బేగం పాల్గొన్నారు. అలాగే పెన్షనర్ల సంఘం కార్యాలయంలో పెన్షనర్ల సంఘం అధ్యక్షులు కేవీఎస్ భానుసింగ్ ఏచూరి మృతికి సంతాపం తెలిపారు. నాయకులు గాలయ్య, సుబ్బరాయుడు, గోపాల్ పాల్గొన్నారు.

బేతంచెర్ల: సీతారాం ఏచూరి సేవలు చిరస్మరణీయమని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లంక సుబ్బరాయుడు, అంగన్‌వాడీ జిల్లా అధ్యక్షుడు షేబారాణి, అన్నారు. పట్టణంలో శుక్రవారం సీపీఎం కార్యాలయంలో ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు జి.వేణుగోపాల్, బాలశేఖర్ పాల్గొన్నారు. అలాగే సీపీఎం కార్యాలయంలో ఏచూరి సంతాప సభ శుక్రవారం నిర్వహించారు. సీపీఎం పట్టణ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యుడు ఎల్లయ్య, పట్టణ మండల కమిటీ నాయకులు ఎస్‌కే బాషా, రామకృష్ణ పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి జిల్లా నాయకుడు సుధాకర్ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మాబు, హుసేన్, త్యాగరాజ్ తిరుపాల్, అచ్చమ్మ పాల్గొన్నారు.

'అల్లర్లకు పాల్పడితే చర్యలు'


చింతలాయపల్లెలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సీఐ, పోలీసులు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 13: ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవని కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని చింతలాయపల్లె గ్రామంలో సీఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో స్పెషల్ పార్టీ పోలీసులు ఫుట్ పెట్రోలింగ్ చేపట్టారు. గ్రామంలోని అన్ని వీధుల్లో పోలీసులు ప్రదర్శన చేశారు. టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య గురువారం రాత్రి జరిగిన ఘర్షణ నేపథ్యంలో గ్రామంలో పర్యటించారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ సుబ్బరాయుడు, విలేజ్ కానిస్టేబుల్ కొండారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి


పోస్టర్లు విడుదల చేసిన వాల్మీకి నాయకులు

డోన్(రూరల్), సెప్టెంబరు 13: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దిలేటి అన్నారు. ఈ నెల 22న కర్నూలు జిల్లా పరిషత్‌లో జరిగే వాల్మీకుల జిల్లా వర్క్‌షాప్‌ను జయప్రదం చేయాలని కోరుతూ డోన్ పట్టణంలో పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో డోన్, ప్యాపిలి మండలాల నాయకులు రామ్‌దాస్, శ్రీధర్, సురేంద్ర, శివ, కళ్యాన్, మోహన్ పాల్గొన్నారు.

ప్యాపిలి: కర్నూలులో ఈ నెల 22న నిర్వహించే వాల్మీకుల సమావేశానికి తరలి రావాలని ఆ సంఘం జిల్లా బాలమద్దిలేటి పిలుపునిచ్చారు. శుక్రవారం ప్యాపిలిలో సమావేశానికి సంబంధించిన పోస్టర్లను వాల్మీకి నాయకులు విడుదల చేశారు. బాలమద్దిలేటి మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే అంశంపై చర్చించిస్తామన్నారు.

పోలీసు బందోబస్తు మధ్య కౌలు వేలం

రుద్రవరం, సెప్టెంబరు 13 : మండలంలోని పేరూరు గ్రామంలో ఈశ్వర, రామస్వామి, ఆంజనేయస్వామి దేవాలయ భూములకు బహిరంగ కౌలు వేలం పోలీసు బందోబస్తు మధ్య శుక్రవారం దేవదాయశాఖ ఈవో నరసయ్య నిర్వహించారు. 339 సర్వేనెంబరులో 14.13 ఎకరాలు, 296లో 0.31 ఎకరాలు, 464లో 2.94 ఎకరాలు, 472లో 1.21, 28లో 10.94, 231లో 8.65, 237లో 1.92, 54లో 9.54, 154లో 2.95, 363లో 11.57, 163లో 6.80, 535లో 0.25,687లో 1.03, 697లో 2.56, 727/1లో .88 ఎకరాలకు కౌలువేలం నిర్వహించారు. ఈ వేలంలో రూ.7.31 లక్షలు ఆదాయం వచ్చింది. గత ఏడాది కంటే ఈ ఏడాది 1.16లక్షలు అదనంగా ఆదాయం చేకూరిందని ఈవో తెలిపారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఈవోలు బండి చంద్రుడు, సాయి జయచంద్రరెడ్డి, సీఐలు వంశీధర్, మోహన్‌రెడ్డి, ఎస్ఐలు వర ప్రసాద్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

పశు బీమాను సద్వినియోగం చేసుకోండి

కోవెలకుంట్ల, సెప్టెంబరు 13: గ్రామాల్లోని పాడి రైతులు పశుబీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి క్రిష్ణకుమార్ సూచించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాడి రైతులు పశువులకు బీమా తప్పనిసరిగా చేయించాలని, ఏదైనా ప్రమాదవశాత్తు పశువులు చనిపోతే బీమా డబ్బుల ద్వారా పశువులను కొనుక్కోవచ్చని అన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

శిరివెళ్ల, సెప్టెంబరు 13 : మండలంలోని చెన్నూరు గ్రామంలో పొలం వద్ద జరిగిన ఘర్షణలో బండారు సుబ్బరాయుడు అనే వ్యక్తి మృతి చెందిన విషయం విదితమే. శుక్రవారం మృతుడి కుమారుడు బండారు పార్థసారథి ఫిర్యాదు మేరకు గ్రామానికి చెందిన మేరువ పెద్ద నాగిరెడ్డి, లక్ష్మీదేవి, మేరువ మహేశ్వరరెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్న పీరయ్య తెలిపారు.

'ఆల్బెండజోల్ మాత్రలతో నులిపురుగుల నివారణ'


ఎంపీడీవోకు ఆల్బెండజోల్ మాత్రలు అందిస్తున్న వైద్యుడు

బనగానపల్లె, సెప్టెంబరు 13: ఆల్బెండజోల్ మాత్రలతోనే నులిపురుగుల నివారణ సాధ్యమని, 19 సంవత్సరాలలోపు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ మాత్రలను వాడాలని వైద్యాధికారి డాక్టర్ శివశంకరుడు సూచించారు. బనగానపల్లె ఎంపీడీవో నాగరాజుకు, మండల విద్యాధికారి కార్యాల యంలో విద్యాధికారి స్వరూప, సీఆర్‌పీలు ప్రసాద్, సుధాకర్‌కు శుక్రవారం వైద్యుడు మాత్రలను అందించారు. మండలంలో 19,500 మంది 19 సంవత్సరాలలోపు వారు ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. సెప్టెంబరు 17వతేదీ జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని పాఠశాలలకు ఈమాత్రలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వైద్య సిబ్బంది వెంకటేశ్వర్లు, అయ్యమ్మ, రమేశ్, నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జనం విజయవంతంపై హర్షం

బనగానపల్లె, సెప్టెంబరు 13: బనగానపల్లె పట్టణంలోని, గ్రామాల్లోను గణేశ్ నిమజ్జనం విజయవతం చేసిన ప్రతి ఒక్కరికీ మండల గణేశ్ ఉత్సవ కేంద్ర కమిటీ గౌరవ సలహాదారు టంగుటూరు శ్రీనయ్య, అధ్యక్షుడు మల్లారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం వారు శ్రీనయ్య కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నిమజ్జనం సందర్భంగా రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సహకారంతో నిమజ్జనం విజయవంతమైందని అన్నారు. మండల ప్రజలతో పాటు సీఐలు కృష్ణయ్య, మంజునాథరెడ్డి, ఎస్ఐలు వెంకటసుబ్బయ్య, దుగ్గిరెడ్డి, పోలీస్ సిబ్బంది, విద్యుత్ అధికారులు, మెడికల్ సిబ్బందికి, ఇతర సిబ్బంది ఎంతో కృషి చేశారన్నారు. నిమజ్జనం సందర్భంగా క్రేన్‌ను అందించి సహకారం అందించిన జయజ్యోతి సిమెంట్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. లాయర్ నాగేంద్రారెడ్డి, ఖాదర్, కోడినగేశ్‌బాబు, తలారిహరి, శ్రీరాముల రాంబాబు, శేఖర్‌రెడ్డి, శ్రీరాముల బాలకృష్ణ, బత్తుల భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పంట నమోదు చేసుకోవాలి'

సంజామల, సెప్టెంబరు 13: ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులు ఈ నెల 15లోగా పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి సుధాకర్ రెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా రైతులకు ఎరువులు అందుబాటులో ఉన్నాయని ప్రభుత్వ ధరలకే డీలర్లు విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మండల వ్యాప్తంగా ఎరువుల కొరత ఎక్కడా లేదన్నారు. డీఏపీ, యూరియా తదితర ఎరువులు అవసరమయితే రైతు సేవా కేంద్రాల్లో గానీ, 8331057495 నెంబరును సంప్రదించి గానీ ఎరువులను తీసుకోవచ్చని ఆయన తెలిపారు.

బనగానపల్లె: రైతులు తాము వేసిన పంటను నమోదు చేయించుకుంటేనే ప్రభుత్వం నుంచి అందే సహాయాలు అందుతాయని, పంటలు వేసుకున్న రైతులు తప్పనిసరిగా పంటనమోదు చేయించుకోవాలని బనగానపల్లె మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి శుక్రవారం తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. వ్యవసాయాధికారి మాట్లాడుతూ పంట నమోదు చేయించుకోకుంటే వారి ఆధార్ కార్డులుపొలం పాస్‌బుక్, బ్యాంక్ అకౌంట్ తీసుకొని రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలని, అలాగే ఈకేవైసీ చేసుకోవాలని సూచించారు.

విద్యా సామగ్రి పంపిణీ


బాలికలకు విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న లక్ష్మణ్ నాయక్, హెచ్ఎం

ప్యాపిలి, సెప్టెంబరు 13: మండలంలోని సీతమ్మ తండా ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం బాలికలకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. మిలిటరీ ఉద్యోగి బాలునాయక్ ఇచ్చారు. స్థానిక గ్రామవాసి, ట్రెజరీ ఉద్యోగి ఈ వస్తులను అందజేశారు. 150 మంది బాలికలకు రూ.10వేల విలువ చేసే వివిధ రకాల పుస్తకాలు, పెన్నులు, జామెంట్రీ బాక్స్‌లను ఆయన అందజేశారు. హెచ్ఎం పద్మావతి, గ్రామస్తులు లక్ష్మణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ ఎస్ఐగా నాగరాజు

డోన్(రూరల్), సెప్టెంబరు 13: డోన్ పట్టణ ఎస్ఐగా బి.నాగరాజు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. నంద్యాల వీఆర్‌లో ఉన్న ఎస్ఐ నాగరాజును డోన్ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు ఎస్ఐగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు వచ్చాయి. ఈ మేరకు ఆయన శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు.